ప్లాస్టిక్‌తో భవిష్యత్‌కు ముప్పు

- జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్‌ను నియంత్రించాలి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై ప్రభావాన్ని చూపే ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రభుత్వ కార్యక్రమంలా భావించకుండా..మన ఆరోగ్యానికి ఉద్దేశించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం అని స్పష్టం చేశారు. గతంలో గుడ్డ సంచులు, జ్యూట్‌బాగులు వినియోగించేవారని కాలక్రమేణా వాటి వినియోగం తగ్గిందన్నారు. మళ్లీ వాటి వినియోగం పెరగాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్లాసి క్ వినియోగాన్ని నియంత్రించాలన్నారు. సెప్టెంబర్ నెల గ్రీన్ ఏపీ కాన్సెప్ట్‌లో భాగంగా అడవుల పెం పకం ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.దీనిలో భాగంగా ప్లాంటేషన్ డ్రైవ్‌లు, అర్బన్ టెర్రస్ గార్డెనింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచే వారిని ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఆర్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆర్‌వీ.రామలింగేశ్వరరావు, ఎంహెచ్‌వో వినూత్న తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్సీ సోము



బొమ్మూరులో మొక్కను నాటుతున్న హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తదితరులు



కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్ పరిసరాలను చీపుర్లు పట్టుకుని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, చైర్‌పర్సన్ రత్నకుమారి

స్వచ్ఛ ఆంధ్ర

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.. నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములయ్యారు.. కొంత మంది పారిశుధ్యం మెరుగుపర్చగా.. మరికొంత మంది మొక్కలు నాటారు.. ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

మాకు సీట్లు కావాలి..



స్త్రీలకు మాత్రమే.. గతంలో ఆర్‌టీసీ బస్ ఎక్కితే ముందు వరుసలో కొన్ని సీట్లు వెనుక పెద్ద పెద్ద అక్షరాలతో కనిపించేవి.. మరి నేడు ఏ బస్‌లో చూసినా మహిళలే ఉంటున్నారు.. అన్ని సీట్లలో వాళ్లే కూర్చుంటున్నారు. అందుకే పురుషులకు మాత్రమే అని కొన్ని సీట్లకు బోర్డులు ఏర్పాటుచేయాలి.. ఓ ప్రయాణికుడి డిమాండ్ ఇది..

అమ్మగారింటికి వెళ్లానంతే..!



ఓ భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాడు. భార్య కనిపించలేదు. కంగారుపడి ఇల్లంతా వెతికాడు. చివరికి ఫోన్ చేశాడు. మా అమ్మవాళ్ల ఇంటికి కూర ఇవ్వడానికి వచ్చానని అవతల నుంచి సమాధానం వచ్చింది. 10 కిలోమీటర్ల దూరం.. వారానికి ఐదుసార్లు ఇదేం పని అని భర్త కాస్త కోపగించుకున్నాడు. బస్సు ఫ్రీయే కదా అని!.. భార్య సమాధానం విని భర్తకు దిమ్మతిరిగింది.

అబ్బే ఏమీ చేయనండి...



రాజమహేంద్రవరంలోని ఓ గృహిణి ఈమధ్య ఉదయం భర్త ఆఫీసుకు వెళ్లగానే ఆమె కూడా ఇంటికి తాళం వేసి వెళ్లి.. సాయంత్రం ఇంటికి చేరుతోంది. కొద్దిరోజుల తర్వాత పక్కవాటా ఆవిడ పలకరించి ఏదైనా ఉద్యోగంలో చేరారా ఆరాతీసింది. అబ్బే నేనేమీ చేయనండి.. ఫ్రీ బస్ కదా.. తునిలో ఉన్న మా అమ్మగారింటికి వెళ్లి వస్తున్నానంతే.. ప్రశ్నించిన మహిళకు నోట మాట రాలేదు మరి..!

పిలవడమే ఆలస్యం.. !

ఇటీవల కొవ్వూరులో ఒక ఇంట్లో ఒక వేడుక చేసుకున్నారు.. ఆ ఇంటావిడ.. అమ్మగారి ఊరెళ్లి వాళ్ల వీధిలో ఉన్నవాళ్లందరికీ ఫంక్షన్‌కు రావాలని చెప్పి వచ్చేసింది.. ఆ వీధిలోని మహిళలు ఒక్కరూ ఆగలేదు.. తెలిసినోళ్లు.. తెలియనోళ్లు యాభై మందిపైనే వచ్చి వెళ్లారు.. దాంతో ఆ ఇంటావిడకు ఏం చేయాలో పాలుపోలేదు..



బస్టాండ్‌లో రెడీ..గా

దూరప్రాంతాలకు ప్రయాణం చేసే మహిళలు..ఆర్టీసీ బస్టాండ్లలోనే అన్ని పనులు చేసుకుంటు న్నారు.. శనివారం రాజమండ్రి ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఒక మహిళ జుట్టు దువ్వుకుంటూ ఇలా కనిపించింది.

ఆదివారం.. ప్రత్యేకం

ప్రయాణంలో.. పడనిసలు!



బస్..కిక్కిరిసి : రాజమండ్రి బస్టాండ్‌లో మహిళల పోటాపోటీ

మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాలను తెచ్చింది. అయితే స్త్రీ శక్తికి .. ప్రగతిశక్తి వణికిపోతోంది.కొనసరు పనులపై ఎక్కువగా ప్రయాణాలు చేస్తుండడం, అవసరం లేకపోయినా 'ఫ్రీయే కదా!' అనే ధోరణి అవలంభిస్తుండడంతో నిజంగా అవసరం ఉన్న మహిళలు నరకం చూస్తున్నారు. వృద్ధులు, పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, విద్యార్థులు, రోజు వారీ అవసరాలపై తిరిగేవాళ్లు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లో లక్షలాది మంది మహిళలు ఉచితంపై ప్రయాణాలు సాగించారు. పథకం రాక మునుపుకంటే రెండింతలు పైనే మహిళలు ప్రయాణిస్తున్నారని తేలింది. పరిమితికి మించి ప్రయాణి కులు ఎక్కడం నిషేధమైనా ఆ నిబంధన బస్సెక్కింది. దీంతో బస్‌ల మైలేజీ లీటరు డీజిల్‌కు 5.50 కి.మీ నుంచి 5కి తగ్గింది. టైర్ల అరుగుదల వేగమైంది. ఇలా విభిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కొత్త బస్సులు కావాలి

ఆర్టీసీలో కొత్త బస్సుల అవసరత కనిపిస్తోంది. తూర్పుగోదావరి, కాకినాడకు చేరో 50 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు వస్తాయని చెబుతున్నారు. అవి ఫిబ్రవరికి వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు 50 బస్సుల చొప్పున కొత్తవి కావాల్సిందే. తూర్పుగోదావరి జిల్లాలో 285, కాకినాడ 291, కోనసీ మలో 300 కలిపి 876 బస్సులు ఉండగా.. 600 వరకూ ఉచిత ప్రయాణాలకు తిరుగుతున్నాయి.

- రాజమహేంద్రవరం/ అర్బన్/ కొవ్వూరు/నిడదవోలు/ కాకినాడ కార్పొరేషన్/ పిఠాపురం/సామర్లకోట/ ఆత్రేయపురం/రావులపాలెం

బంధువుల ఇళ్లకు క్యూ

నగరాలు, పట్టణాలకు పరిసరాల్లో ఉన్న గ్రామాలకు చెందిన మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఒకప్పుడు పెద్ద పెద్ద పనులు ఉంటేనే బస్సు ఎక్కే మహిళలు.. ఇప్పుడు చిన్నచిన్న అవసరాలకు, చిన్నచిన్న ఆనందాలకు బస్సులెక్కి పట్టణాలకు వస్తున్నారు. కొందరు బంధు వుల ఇళ్లకు క్యూకడుతున్నారు. మరి కొందరు షాపింగ్ చేస్తున్నారు.. ఇంకొందరు ఆలయాలకు వెళుతున్నారు.. ప్రతి బస్‌కి సుమారు 56 సీట్లు ఉంటాయి.. కానీ పలు రూట్లలో 100 నుంచి 120 మంది బస్సు ఎక్కుతున్నారు. దీంతో బస్ కిక్కిరిసిపోతోంది.

ఆలయాలకు వెళుతున్నాం..



మాది పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు. కాకినాడలో 11 రోజులపాటు జరగనున్న శ్రీపీఠం మహాశక్తి యాగంకి మేమంతా రావడానికి ఉచిత బస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతిరోజు గ్రూపుగా వచ్చి వెళుతున్నాం. చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు. - విజయలక్ష్మి, మార్టేరు

- స్త్రీ శక్తికి.. ప్రగతి శక్తి వణుకుతోంది
- అధిక బరువుతో ప్రయాణిస్తున్న బస్సులు
- తగ్గిపోయిన మైలేజీ.. పెరిగిన సమయం
- నిత్య ప్రయాణికులకు ఆపసోపాలు
- నెలలో.. హ్యాప్రీ ఖర్చు రూ.23 కోట్లు

ఇదీ ఆలోచించాల్సిందే!

ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగుల్లో రోజువారీ ప్రయాణికుల కోసం కొన్నింటిని కేటాయించినా లేదా ఆ సమయాల్లో మహిళ రద్దీ తక్కువగా ఉండేట్లు చూసినా ఉద్యోగినులు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.



వైజాగ్ నుంచి వాడపల్లి వచ్చాం..

విశాఖపట్నం కంచరపాలెం నుంచి వాడపల్లి వచ్చాం. ఇది నాల్గో శనివారం. తుని వరకూ బస్సులో వెళ్లి అక్కడి నుంచి అనకాపల్లి- విశాఖపట్నం వెళతున్నాం.

హ్యాప్రీగా తిరిగొస్తున్నారు!



పుణ్యక్షేత్రాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని ప్రతి శనివారం 50 వేల నుంచి 70 వేల మంది భక్తులు దర్శించుకుంటారు. వీరిలో మహిళా భక్తుల శాతమే అధికం. ఉచిత బస్ ద్వారా వాడపల్లి చేరుకుంటున్న మహిళలు మాడవీధుల్లో ప్రదక్షిణలు చేసి ఉచిత దర్శనం చేసుకుంటున్నారు. ఉచిత అన్నప్రసాదం స్వీకరించి మళ్లీ ఉచిత బస్సు ద్వారా మహిళలు తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. అన్నవరం, అంతర్వేది, అయినవిల్లి, బిక్కవోలు లక్ష్మీగణపతి, పిఠాపురం పాదగయ క్షేత్రాలకు భక్తులు వెళుతున్నారు.



డ్రైవర్‌గారు.. మీరు ఫ్రీ కదా!

డ్రైవర్‌గారూ ఒకసారి మా అబ్బాయిని పట్టుకోండి.. బస్ ఎక్కిన తరువాత తీసుకుంటా.. శనివారం రద్దీగా ఉండడంతో రావులపాలెం బస్టాండ్‌లో ఒక మహిళ తన కుమారుడిని డ్రైవర్‌కు ఇచ్చి బస్సెక్కింది.

కండక్టర్లు, డ్రైవర్లకూ ఇబ్బందే..

మహిళా బస్సు ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడంలేదు. సీటు కోసం పోటీపడే క్రమంలో టికెట్ తీసుకోవడం మరిచిపోతున్నారు. కొంతమంది అవగాహన లేక ఆధార్‌కార్డు తెచ్చుకోకుండా కండక్టర్లతో వివాదానికి దిగుతున్నారు. ఇంకొందరు ఉచిత మే కదా దానికి టికెట్ ఎందుకని గొడవ పడుతున్నారు. ఎక్కడైనా చిన్నచిన్న తగాదాలు కండక్టర్లకు తలనొప్పిగా మారుతున్నాయి.



నెల ఖర్చు రూ.23 కోట్లు

జిల్లా	ప్రయాణికులు	రాబడి	ఫ్రీ టిక్కెట్లు	ఫ్రీ..మొత్తం	ఆక్యుపెన్సీ
కాకినాడ	34,46,175	20,23,54,098	21,18,454	7,68,36,103	61%
కోనసీమ	35,66,319	18,46,74,118	22,51,745	6,86,52,333	63%
తూర్పు	14,49,840	8,69,21,736	25,00,354	8,22,85,982	63%
ఉమ్మడి జిల్లా	84,62,334	47,39,49,952	68,70,553	22,77,73,822	62%

ఇవీ మా ఇబ్బందులు..

మాకు ఊపిరిసలపడంలేదు..



మహిళలకు ఉచిత ప్రయాణంతో కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. మహిళలతో బస్‌లు నిండిపోవడంతో బస్‌లో తిరగడానికే కష్టంగా ఉంటుంది. బస్‌లో ఊపిరిసలపడం లేదు. ఐనా ఓపికగా సహకరిస్తున్నాం.
- ఎస్ఎస్ఎస్.రావు, కండక్టర్, రావులపాలెం

దగ్గర దూరం వాళ్లే ఎక్కేస్తున్నారు..



మా బస్ నిడదవోలు నుంచి కాకినాడకు వెళతోంది. మా బస్సులో దగ్గర దూరం మహిళలు ఎక్కేస్తున్నారు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.
- సుధీర్, కండక్టర్, నిడదవోలు

టిక్కెట్లు కొట్టి.. బస్‌లు నడపలేం..



సింగిల్ క్రూ విధానంలో నడిపే బస్సులకు డ్రైవర్లకు టిమ్ ఇస్తున్నారు. ఒకవైపు మహిళలను బస్సులో ఎక్కించాలి, మరోవైపు టిక్కెట్లు కొట్టాలి. ఈ దశలో బస్సులు నడపడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.
- దుర్గారావు, డ్రైవర్, ఏలేశ్వరం

ఆధార్ ఒరిజినల్ తేవాలి..



మహిళలు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొస్తే సమయం కలిసొస్తుంది. కొంత మంది జిరాక్స్, మరికొంత మంది మొబైల్ ఫోన్‌లో తీసి చూపుతున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతోంది.
- సత్యవతి, కండక్టర్, కాకినాడ

జనసేన రాజమండ్రి అర్బన్ ఇన్‌చార్జిగా అనుశ్రీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జనసేన రాజమహేంద్రవరం అర్బన్ ఇన్‌చార్జిగా అనుశ్రీ (అత్తి) సత్యనారాయణనే పార్టీ అధిష్ఠానం మళ్లీ నియమించింది. గతంలో జనసేన అధినేత, పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు సినిమా విడుదలలో కొందరు చేసిన రాజకీయం వల్ల అనుశ్రీని రాజమహేంద్రవరం అర్బన్ ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన జనసేనలోనే ఉన్నారు. కూటమి నేతలతో కూడా కలిసిపోయారు. అయితే గతంలో ఓ సినీ నిర్మాత చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను తప్పించింది. తర్వాత ఆయన పనితీరును గుర్తించిన అధిష్ఠానం

ఉత్తర్వులు విడుదల చేసిన అధిష్ఠానం

తిరిగి ఆయననే అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.పవన్ కల్యాణ్ నిర్ణయం ప్రకారం ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను తొలగించి, తిరిగి నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు జనసేన అధ్య క్షుడు రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

మరింత కసిగా పనిచేస్తా : అనుశ్రీ

తనపై తమ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఉంచిన నమ్మకంతో మరింత కసిగా పార్టీకోసం పనిచేస్తా. పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉంటా.

పెద్దేవంలో పశువులకు థైలేరియాసిస్

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దేవంలో గేదెలకు సోకిన అంతుచిక్కని వ్యాధిని గుర్తించి అధికారులు చికిత్స అందిస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో పశుసంవర్థకశాఖ అధికారులతో సమీక్షించారు. పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో పశువుల మరణాలను అసెంబ్లీ వేదికగా మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. మృతిచెందిన పశువులకు సంబంధించి నష్ట పరిహారం అందించాలని కలెక్టర్‌ను కోరతానన్నారు. రైతులందరూ పాడి పశువులకు బీమా చేయించుకునేలా వెబ్‌సైట్ ఓపెన్ చేయాలని అధికారులకు సూచించారు. పెద్దేవం, పంగిడి, తణుకు పట్టణాల్లో వ్యాధి లక్షణాలు గుర్తించినట్టు అధికారులు తెలిపారన్నారు. పశుసంవర్థకశాఖ జేడీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండు వారాలుగా పెద్దేవంలో పశువులు అంతుచిక్కని వ్యాధి సోకి మృతి చెందుతున్నాయన్నారు. 10 గేదెలు మృతిచెందగా మరో 15 గేదెలకు ఈ వ్యాధి సోకిందని తెలిపారు.పరీక్షలు నిర్వహించగా పశువుల్లో మెటబాలిజం డిజార్డర్లు కనిపించాయి. రక్త, పేడ నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించగా పేడలో జలగ పురుగులు కనిపించాయన్నారు. రక్త నమూనాల్లో థైలేరియాసిస్ వ్యాధిని గుర్తించామన్నారు.ఈ రెండు వ్యాధుల వల్ల పశువులు మృతిచెందుతున్నాయని నిర్ధారణకు వచ్చి చికిత్స అందిస్తున్నామన్నారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో రెండు పశువులకు కనిపించడంతో చికిత్స అందించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బందిని ఇంటింటికి పంపించి పశువుల ఆరోగ్య లక్షణాలపై సర్వే చేయించామన్నారు.వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులన్నింటికి వైద్యం అందుతుందన్నారు.రైతులు ఆందోళన చెందవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, బేతిన నారాయణ, చావా శ్రీనివాస్, పశుసంవర్థకశాఖ డీడీ ఎస్.సత్యనారాయణ, ఏడీ ఎ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటిని రోజూ పరీక్షించండి

కార్పొరేషన్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యత క్రమంలో నగరంలో అభివృద్ధి పనులను చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగ అధిపతులతో శనివారం సమీక్షించారు. తొలుత నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలో చేపట్టిన 15 రహదారి విస్తరణ పనులను నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పురగోతిలో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా సమీక్షించారు. వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాల గురించి అడిగారు. లోతట్టు వీధుల్లో నీరు నిలిచిపోకుండా సమగ్రయాక్షన్ ప్లాన్ సిద్ధంచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా ఫిర్యాదులు రాకూడదని..ప్రతిరోజు పరీక్షించాలన్నారు.



కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

మురుగుకాల్వలో పైపులైను ఉంటే తక్షణమే మార్చాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లీ, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్, ఈఈలు మాధవి, మదర్సా ఆలీ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీలు, అధికారులు పాల్గొన్నారు.



దేవి.. వైభవం

దేవి నవరాత్రి ఉత్సవాలకు రాజమహేంద్రవరం దేవిచౌక్ ముస్తాబైంది.. పెద్ద ఎత్తున విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. . అత్యాధునిక డిజిటల్.. త్రీడీ లైటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పెద్ద ఎత్తున చలువ పందిళ్లు వేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు.92వ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.
- రాజమహేంద్రవరం కల్చరల్

ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు..

జీతాలు వదలరు?

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎద్దేవా



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు కానీ..ప్రతి నెలా జీతాలు మాత్రం తీసుకుంటున్నారని..ప్రజా సమస్యలు పట్టని ఇలాంటి ఎమ్మెల్యేలు ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ధ్వజమెత్తారు. జెఎన్‌రోడ్డు వి కన్వెన్షన్‌హాలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు వస్తారని భావించామని, సమావేశాల్లో ప్రజలకు ఉపయోగ పడే కీలక అంశాలు చర్చించామన్నారు. జగన్‌తో సహా పార్టీ 11 మంది డుమ్మా కొట్టారన్నారు. ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని, ప్రజలే ఛీకొట్టి ఇవ్వని ప్రతిపక్ష హోదా ప్రభుత్వం ఎలా ఇస్తుందన్నారు.మాట్లాడే సమయం ఎక్కువ ఇస్తామని చెబుతున్నా అసెంబ్లీకి రావడంలేదని మండిపడ్డారు. ఆ పార్టీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో పోరాడతారు కానీ.. ఎమ్మె ల్యేలు అసెంబ్లీకి రారని ఎద్దేవా చేశారు.

రేపు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం తెలిపారు.ఆర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.అర్జీ స్థితి తెలుసుకోవడానికి 1100 నెంబరుకు కాల్ చేసే అవకాశం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో అర్జీలు స్వీకరిస్తామన్నారు.



సండే స్పెషల్‌గా తాను ప్రేమతో వండిన మటన్ బిర్యానీని రాఘవ ఎంతో ఆబగా తింటున్నాడు. భార్య సుహాసిని మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. తన వంట భర్తకు నచ్చితే భార్యకు పండగే. భర్త భోజనం చేస్తుంటే సుహాసిని దేనికోసమో ఆత్రంగా ఎదురుచూస్తున్నట్టు ఆమె కనులు స్పష్టంగా చెబుతున్నాయి... భోజనం ముగించి హాలులో కూర్చున్న భర్త ఏదో మాట్లాడాలని సుహాసిని ఆశిస్తోంది...




ఆ రోజు తమ పెళ్లి రోజు. ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న గులాబీ రంగు చీర కట్టుకుని, నల్లతాచులా నిగనిగలాడుతున్న వాలు జడలో తెల్లని మల్లెలతో భర్త కోసం ఎదురుచూస్తోంది ఆకాంక్ష. భర్త అనిరుధ్ వచ్చాడు. అతనికి స్వాగతం పలికి కాఫీ ఇచ్చింది. దేనికోసమో ఆకాంక్ష భర్త వెనకాలే పచార్లు చేస్తోంది. అనిరుధ్ ఇదేమీ పట్టించుకోకుండా తన పనులు కానిచ్చుకుంటున్నాడు. ఆకాంక్ష హృదయంలో ఏదో అసంతృప్తి.



కట్ చేస్తే పొలంలో పని చేసుకుంటున్న రామయ్యకు భార్య సీతామహాలక్ష్మి భోజనం తీసుకెళ్లింది. కోడికూర ఎలా ఉంది' అని భర్తను ప్రశ్నించింది భార్య. 'లక్ష్మీ నీచేతితో ఏమి వండినా అమృతమే. కోడికూర అదిరిపోయింది.' అంటూ రామయ్య భార్యను ఆకాశానికెత్తేశాడు. సీతామహాలక్ష్మి ఆనందానికి అవధుల్లేవు.

రాఘవ, అనిరుధ్ విషయంలో ఏం జరిగింది. నిజానికి రాఘవకు భార్య మటన్ బిర్యానీ ఎంతగానో నచ్చింది. అనిరుధ్‌కు గులాబీరంగు చీరలో భార్య స్వప్నసుందరిలా సాక్షాత్కరించింది. లోలోపల వారిద్దరూ భార్యలను ఎంతగానో మెచ్చుకున్నారు. అయితే ఆ విషయాన్ని బయటకు చెప్పేందుకు అహం అడ్డుగా నిలిచింది. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ భార్యలు మాత్రం ఎంతో అసంతృప్తికి లోనయ్యారన్నది వాస్తవం.

శ్రీమతీ... అదుర్స్



(ఉప్పలగుప్తం-ఆంధ్రజ్యోతి)

అప్పటివరకు అమ్మ, నాన్న, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములే ప్రపంచంగా జీవించిన ఆడది వివాహ బంధంతో మరో ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. అక్కడ తనకు అంతా అపరిచితులే. భర్త మాత్రమే తన ప్రపంచం. అత్తవారి ఇంట్లో ఎవరు ఎలా ఉన్నా భర్త ప్రవర్తన తనకు అనుకూలంగా ఉంటే చాలనుకుంటుంది భార్య. తాను చేసే ప్రతి పనినీ భర్త మెచ్చుకోవాలని కోరుకుంటుంది. భర్త ఇష్టాలను తెలుసుకుని మసలుకుంటుంది. అయితే చాలా మంది భర్తలు మాత్రం భార్య పనులు నచ్చకపోతే శివతాండవం చేస్తారు. నచ్చితే మౌనమునులవుతారు. మౌనమెందుకండీ?? దోసె అదిరిందోయ్ అని భార్యను ప్రశంసించి చూడండి. రోజూ రుచికరమైన టిఫిన్లు మీ నోటికందుతాయి. బాగుంటే మెచ్చుకోవడం గొప్ప కాదండోయ్! నచ్చనప్పుడూ ప్రశంసించి భార్య హృదయాన్ని దోచుకోవచ్చు. వంకాయ కూరలో కారం ఎక్కువయ్యింది. 'కూర ఎలా ఉంది' అని భార్య అడిగితే బాగుందంటూనే లోపాన్ని ఎత్తి చూపొచ్చు. వంకాయ కూర అదిరింది శ్రీమతీ!! కొంచెం కారం తగ్గించి ఉంటే ఇంకా అదుర్స్ అని చూడండి. ఆ తర్వాత అన్నికూరలూ మీకు నచ్చేలా తయారవుతాయి. రోజూ ఏదో సందర్భంలో ఏదో ఒకలా భార్యపై ప్రశంసల జల్లు కురిపించి చూడండి. మీ దాంపత్య జీవితంలో ఆనందం వర్షిస్తుంది.

ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంలోనూ భార్యను ప్రశంసించవచ్చండీ. మా రాధ కాఫీ పెడితే అమృతమేనండీ అని మీ బంధువుల సమక్షంలో అన్నారనుకోండి. ఆ సమాచారం అలాఅలా మీ శ్రీమతికి చేరిందనుకోండి. ఇంకేముంది ఆ రోజు మీకు అన్నీ శుభ శకునములే. మరి ఇంకెందుకు ఆలస్యం?? భార్యను ప్రశంసించడం మొదలుపెట్టండి. అన్నట్టు ఈ రోజు భార్యలను ప్రశంసించే రోజంట. అందుకే ఈరోజే మీలో సగాన్ని మెచ్చుకోండి. అంటే మిమ్మల్ని మీరే మెచ్చుకుంటున్నారన్న మాట.



(సెప్టెంబరు 3వ ఆదివారం: భార్యలను ప్రశంసించే రోజు సందర్భంగా)

మహిళా... మాస్టార్లు

ఒకప్పుడు మహిళలంటే వంటింటి కుందేళ్లు అనేవారు.. నేడు అన్నింటా అతివలదే హవా!. అన్ని రంగాల్లోనూ తమదే పై చేయి అంటున్నారు. ఆటైనా... పాటైనా.. పోటీ పరీక్షలైనా.. ఆకాశమే హద్దు.. అవకాశం వదలొద్దు అన్న రీతిలో ప్రతిభ చూపుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో మగవారికి దీటుగా సత్తా చాటుతున్నారు.



మెగా డీఎస్సీలో అతివలదే హవా

సగానికిపైగా ఉపాధ్యాయ పోస్టులు వారి సొంతం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాకినాడ జిల్లాకు చెందిన ఓ బాలిక 600కి 600 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గతంలో ఎవరూ సాధించలేని ఘనతను ఆమె సాధించింది. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాల్లోనూ మహిళలు పలు ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఇక తాజాగా విడుదలైన మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో తమకు తిరుగులేదని నిరూపించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన పోస్టుల్లో సుమారు 50 శాతానికిపైగా ఉద్యోగాలను అతివలే సంపాదించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఈసారి డీఎస్సీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈసారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదులో ముందున్నారు. మొత్తం 38,617 మంది పరీక్షలు రాశారు. ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించి 111 పోస్టులకు పరీక్షలు నిర్వహించారు.



కాకినాడ జిల్లా చేబ్రోలులోని ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన మహిళా అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు

వారితో కలిపి మొత్తం 1349 పోస్టులకు నిర్వహించిన డీఎస్సీ లో మహిళలు ప్రతిభ కనబరిచి ముందంజలో నిలిచారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, టీజీటీ, పీజీటీ తదితర పోస్టులకు పురుషులతో సమానంగా మహిళా అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది జాబితాకు ఎంపికైన వారిలో 654 మంది అంటే 48.4 శాతం మంది పురుషులు ఉండగా.. 695 (51.6 శాతం) మంది మహిళలు ఉన్నారు. ఇందులో గవర్నమెంట్/లోకల్ బాడీస్‌కు పురుష అభ్యర్థులు 540 మంది కాగా మహిళా అభ్యర్థులు 490 మంది ఎంపికయ్యారు. మున్సిపల్ స్కూల్స్‌కు పురుష అభ్యర్థులు 31, మహిళా అభ్యర్థులు 41 మంది, మున్సిపల్ కార్పొరేషన్‌కు పురుషులు 50 మంది, మహిళలు 85 మంది, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలలకు సంబంధించి 33 మంది పురుష ఉపాధ్యాయులు, 79 మంది మహిళా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పురుషుల కంటే మహిళలు సుమారు 41 మంది అధికంగా ఉద్యోగాలు సంపాదించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థుల వివరాలు ఇవీ..

సబ్జెక్టు	పురుషులు	మహిళలు	మొత్తం
ఎస్ఏ (తెలుగు)	23	35	58
ఎస్ఏ (ఇంగ్లీష్)	50	45	95
ఎస్ఏ (హిందీ)	12	66	78
ఎస్ఏ (బయాలజీ)	45	62	107
ఎస్ఏ (ఫిజికల్ సైన్స్)	55	19	74
ఎస్ఏ (గణితం)	44	20	64
ఎస్ఏ (సోషల్ స్టడీస్)	84	48	132
ఎస్ఏ (పీఈటీ)	142	69	211
సంస్కృతం	3	2	5
ఎస్జీటీ (మైదానం)	167	254	421
ఎస్జీటీ (మన్యం)	28	76	104

సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నేష్‌కుమార్

- ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలని, సందర్శకులకు ఆహ్లాదాన్నందించే సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓఎన్జీసీ (ఈవోఏ, హెచ్‌బీటీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రత దినోత్సవం సందర్భంగా ఓఎన్జీసీ, ఇండియన్ కోస్ట్‌గార్డు, రిలయన్స్, కాకినాడ సీపోర్ట్సు లిమిటెడ్, కోస్టల్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో తీర ప్రాంత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహ్లాదాన్ని అందించే సముద్రతీరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. సముద్ర పర్యావరణాన్ని కాపాడుకునేందుకు బీచ్‌లో ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదన్నారు. సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి (యూఎన్ఈపీ), దక్షిణాసియా సహకార పర్యావరణ కార్యక్రమం (ఎస్ఏసీఈపీ)ల ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 3వ శనివారం ప్రపంచ వ్యాప్తంగా బీచ్ క్లీనప్ డే కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతోందన్నారు. బీచ్‌లో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు కలుషితం కావడంతో తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలోని సముద్ర జీవులు,మానవ ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు స్థానికంగా ఉన్న ఎన్జీవోలు, విద్యాసంస్థలు, యువతతో కలసి ఏటా తీర ప్రాంత శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు బీచ్‌లో 3గంటల సేపు బీచ్‌లో పేరుకుపోయిన సుమారు 1000 కిలోల ప్లాస్టిక్, చెత్తా వ్యర్థాలను సేకరించి, మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్, మున్సిపల్ కార్పొరేషన్, పలు కాలేజీల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే సందర్భంగా సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుదామంటూ శనివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో రూపొందించిన సైకత శిల్పం.
-సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి).

80 కిలోలు..రూ.50 వేలు

జాలరి వలకు చిక్కిన రెండు సొరలు



వలకు చిక్కిన సొర చేపలు

కాకినాడలోని కుంభాభిషేకం ఫిషింగ్ హార్బర్ వద్ద ఒక మత్స్యకారుడి వలకు రెండు భారీ సొర చేపలు చిక్కాయి. ఒక్కొక్క చేప 40 కిలోలు బరువున్న ఈ చేపలు రెండు రూ.50 వేలు ధర పలకడంతో ఆ మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. సొర చేపలకు డిమాండ్ ఉంటుందని మత్స్యకారులు చెప్పారు.
-కార్పొరేషన్(కాకినాడ)/ఆంధ్రజ్యోతి.

లాకుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



చొప్పెల్ల లాకులను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

నీటిపారుదల శాఖ ప్రాజెక్టు చైర్మన్ సునీల్‌కుమార్

ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల వ్యవస్థలో కీలకంగా ఉన్న లాకుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించినట్టు నీటిపారుదల శాఖ ప్రాజెక్టు రాష్ట్ర చైర్మన్ సునీల్‌కుమార్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద కోరంగి కాలువపై ఉన్న ప్రధాన లాకులను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల లాకులు దెబ్బతిన్నాయని, దీంతో ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. వాటిని అభివృద్ధి చేసి నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచి రైతులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్, సుధాకరరెడ్డిలను ఆలమూరు డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి సత్కరించారు. అనంతరం లాకుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించారు.

1.04లక్షల ఎకరాలకు సాగునీరు: ఈఈ

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి వచ్చే నీటిని అదుపు చేసి పంట కాలువకు సాగునీరందించే చొప్పెల్ల ప్రధాన లాకుల ద్వారా 1,04,934 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వీవీ రామకృష్ణ తెలిపారు. లాకుల సందర్శనకు ప్రాజెక్టు టీంతో పాటు వచ్చిన ఆయన కొద్దిసేపు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రెండో పంటకు 94,500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. మొదటి పంటకు రోజుకు 1000 నుంచి 1300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని, అలాగే రెండో పంటకు 1600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు రామకృష్ణ చెప్పారు. ప్రస్తుతం లాకుల గేట్లు బాగా దెబ్బతిన్నాయని తక్షణం మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు.

భక్తవత్సల గోవిందా..గోవిందా

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆదాయం రూ.61.08 లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జోరువానను సైతం లెక్కచేయ్యకుండా అశేష భక్తజనం తిరువీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఆదాయం రూ.61.08 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ

బిక్కవోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీకి గురైందని బలభద్రపురానికి చెందిన సబ్బెళ్ల బులివెంకటరెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం..బులివెంకటరెడ్డికి బిక్కవోలు-నల్లమిల్లి రోడ్డులో పామాయిల్ తోట ఉంది. దానిలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరు దొంగిలించారని పక్క రైతు శనివారం ఉదయం ఫోన్ చేయడంతో ఆయన వెళ్లి పరిశీలించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

పంచాయతీలు సొంత ఆదాయాన్ని పెంచుకోవాలి: జడ్పీ చైర్మన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీ సొంత ఆదాయాన్ని పెంచుకోవాలని, ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సూచించారు. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంచుకునే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆఖరి రోజు శనివారం వేణుగోపాలరావు పాల్గొని ప్రసంగించారు. జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను త్వరగా చేరుకునేందుకు మరింత సొంత ఆదాయ వనరులను పెంచుకునే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో జరిగే మండల స్థాయి శిక్షణలు ఇదే విధంగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ వేణు, సీఈవో లక్ష్మణరావు

భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బందోబస్తు

- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- రమణయ్యపేటలో మహాశక్తి యాగం ప్రాంగణం పరిశీలన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు జరిగే మహాశక్తి యాగం బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ జి.బిందుమాధవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్లను నియమిస్తున్నామన్నారు. ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ జామ్ లేకుండా వివిధ మార్గాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందన్నారు.అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంచుతామన్నారు. అన్నప్రసాదం, ప్రవేశద్వారం వద్ద తోపులాటలు జరక్కుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, శ్రీపీఠం వలంటీర్లతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. యాగ ప్రాంగణాన్ని పరిశీలించి పోలీసులు, నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట ఎస్‌డీపీవో, పలువురు సీఐలు, ఎస్ఐలు, శ్రీపీఠం ప్రతినిధులు వున్నారు.



మహాశక్తి యాగం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

'స్మార్ట్'గా మారండి...

● స్మార్ట్ రేషన్ కార్డు అందుకోవడానికి సులువైన మార్గం
● జాడ చెప్పేందుకు గూగుల్ సిద్ధం



అమలాపురం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రేషన్ అక్రమాలకు చెక్ పెడుతూ ఆధునిక సాంకేతికతకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టింది. వాటిని జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలు, చౌకధరల దుకాణాల వారీగా ఇంటింటికీ పంపిణీ కార్యక్రమం శరవేగంగా చేపట్టారు. అయితే ఇంత వరకు మీకు స్మార్ట్ రేషన్ కార్డు అందలేదా? ఆందోళన వద్దు. నేటికి స్మార్ట్ రేషన్‌కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియక ఎందరో తికమక పడుతున్నారు. అందువల్ల మీ రేషన్ కార్డు ఎక్కడ ఉందో మీ ఇంటి నుంచే తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీని కోసం సెల్‌ఫోన్ తీసుకుని గూగుల్‌లోకి వెళితే చాలు. రేషన్‌కార్డు ఏ ప్రాంతంలోని ఏ నంబరు చౌకధరల దుకాణంలో ఉన్నదీ, సచివాలయ పరిధి ఎవరికి వారే సులువుగా తెలుసుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్లలో గూగుల్ సెర్చ్‌లోకి వెళ్లి ఏపీఈపీడీఎస్1 అనే టైప్ చేయాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ డిపార్టుమెంట్ ఆఫ్ కన్స్యూమర్స్ ఎఫైర్స్ అనే విండో ఓపెన్ అవుతుంది. అక్కడ డాష్ బోర్డు అన్న విండో అనే ఆంగ్ల అక్షరాలపై క్లిక్ చేయాలి. వెంటనే రైస్‌కార్డు సెర్చ్ అనే ఆప్షన్ వస్తుంది. దీనిపై మీ పాత రైసుకార్డు నంబరును ఎంటర్ చేయగానే స్మార్ట్‌కార్డు ఏ సచివాలయం రేషన్ డిపోలో ఉందో సంబంధిత వివరాలు చూపిస్తుంది. తద్వారా అక్కడకు వెళ్లి సులువుగా స్మార్ట్‌రేషన్ కార్డులను పొందవచ్చు.

కుయుగూరులో రైల్వేస్టేషన్

● రూటు మారిన మల్కన్‌గిరి పాండురంగాపురం రైల్వేలైన్
● ఒడిస్సాలో చురుగ్గా భూ సేకరణ పనులు ● ఎకరాకు రూ.10 లక్షల చెల్లింపులు



కూనవరంలో భూ నాణ్యత పరీక్ష చేస్తున్న రైల్వే లైన్ టెండరు సిబ్బంది (ఫైల్)

చింతూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్కనగిరి టూ పాండురంగాపురం రైల్వేలైన్ రూట్ మారనుంది. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజుజిల్లా చింతూరు మండలం, కుయుగూరులో రైల్వేస్టేషను ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా భూసేకరణ అధికారి ఓ అభ్యర్థనలో భాగంగా గ్రీవెన్సులో ధ్రువీకరించారు. దీంతో మల్కన్‌గిరి టూ పాండురంగాపురం బ్రాడ్‌గేజ్ లైన్ ఇప్ప టివరకు అనుకున్నట్లు కాకుండా రూటు మారనున్నట్లు స్పష్టమవుతోంది. ఒడిస్సాలోని మల్కనగిరి నుంచి వయా మన రాష్ట్రంలోని విలీన మండలాల మీదుగా తెలంగాణలోని పాండురంగాపురం వరకు నూతన రైల్వేలైన్ ఏర్పాటుకు గతేడాది ఆగస్టులోనే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి గతిశెట్టి మాస్టర్‌ప్లాన్ పథకంలో భాగంగా ఈ నూతన లైన్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం పనులు వేగవంతం చేసింది. ఇందులోభాగంగా ఒడిస్సాలోని మల్కనగిరి నుంచి తెలంగాణలోని పాండురంగాపురం వరకు 173.61 కి.మీ మేర నూతన లైన్ ఏర్పాటుకు రూ.3,592 కోట్ల నిధులు కేటాయించారు. వాస్తవానికి ఈ లైన్ ఏర్పాటుకు 2023 లోనే ఎఫ్ఎల్ఎస్ (ఫైనల్ లోకేషన్ సర్వే) పూర్తయింది. తాజాగా ఒడిస్సాలోని మల్కన్‌గిరి జిల్లాలో భూసేకరణ పనులు సంబంధిత శాఖలకు అప్పగించడం, ఆమేరకు భూనిర్వాసితులకు ఎకరాకు రూ.10లక్షల వంతున నష్ట పరి హారం చెల్లింపులు కూడా చక చకా జరుగుతు న్నాయి. ఇదిలావుండగా గతంలో ఈ లైన్ చింతూరు మండలం కన్నాపురం (నరివెల), కూనవరం మండలం కూటూరుగట్టు, పల్లూరు అక్కడి నుంచి ఎటపాక మండలంలోని నందిగామ మీదుగా తెలంగాణలోని భద్రాచలం చేరు కునేందుకు సర్వే చేశారు. అదే దశలో కన్నాపురం, కూటూరుగట్టు, పల్లూరు, నంది గామ లలో రైల్వేస్టేషన్ల ఏర్పాటు దాదాపు ఖరారైంది. తాజాగా చింతూరు మండలంలోని కుయుగూరు, కూనవరం మండలంలోని సీతారామపురం, భీమవరం మీదుగా రాజుపేట(భద్రాచలం) అక్కడి నుంచి పాండురంగాపురం చేరుకొనే దిశగా లైన్ మార్పు చేశారు. ఈ మార్పు నేపథ్యంలో కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేటలలో రైల్వే స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇందులోభాగంగా త్వరలోనే విలీన మండలాల్లో భూసేకరణ పనులు చేపట్టనున్నారు. మొత్తంమీద ఈ ఏడాది డిసెంబరు చివరి కల్లా మూడు రాష్ట్రాల్లో భూసేకరణ పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో చర్యలు వేగవంతమయ్యాయి. 2026 జనవరి నుంచి లైన్‌కు చెందిన క్షేత్ర స్థాయి పనులకు శ్రీకారం చుట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.



పాండురంగాపురం రైల్వేస్టేషన్

కుటుంబాన్ని వేధిస్తూ రోడ్డున పడేశారు

తనను, తన కుటుంబాన్ని కొందరు ఆటో యూనియన్ నాయకులు వేధిస్తూ రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ పిఠాపురంలో ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. పెట్రోల్ పోసుకుని మేడ ఎక్కి దూకేసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు.

● మేడ ఎక్కి పెట్రోల్ పోసుకుని కుటుంబంతో ఆటోడ్రైవర్ ఆందోళన
● తనకు న్యాయం చేయాలని డిమాండ్



మూడు అంతస్తుల మేడ ఎక్కిన ఆటోడ్రైవర్ దుర్గాప్రసాద్

పిఠాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం ఆటో యూనియన్ సభ్యులుగా ఉన్న ఆటో డ్రైవర్ గుండు దుర్గాప్రసాద్, అతని తండ్రి ఏడుకొండలును ఏడాదిన్నర క్రితం యూనియన్ సభ్యత్వం నుంచి తొలగించారు. తమను అన్యాయంగా యూనియన్ నుంచి తొలగించడమేగాక ఊరు వదిలి వెళ్లిపోయినా వేధిస్తున్నారని, దీంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తూ దుర్గాప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి మహాసంస్థానంవద్ద ఆందోళనకు దిగాడు. తనపై వేధింపులకు పాల్పడుతున్న ఆటో యూనియన్ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. రాజకీయ నాయకులు, అధికారులు వద్దకు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. దీంతో తమకు చావే గతి అంటూ వంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. ఆ తర్వాత మేడ ఎక్కి దూకేస్తానని హల్‌చల్ చేశాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. తనకు జీవనోపాధి కోల్పోయేలా చేసిన ఆటో యూనియన్ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో పోలీసులు, దళిత నాయకుడు ఖండవిల్లి సుబ్బారావు వచ్చి తాము సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో దుర్గాప్రసాద్, అతని కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.



పిఠాపురంలో కుటుంబసభ్యులతో ఆందోళన నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్ దుర్గాప్రసాద్, సమస్య పరిష్కరిస్తామని చెబుతున్న పోలీసులు, దళిత నాయకులు

సుద్దగడ్డ కాలువలో ముంచి నన్ను చంపబోయాడు

సుద్దగడ్డ కాలువలో తనను ముంచి చంపబోతే అక్కడ కాలువ దాటేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న తాడు పట్టుకుని బతికి బయటపడ్డాను. అదే సమయంలో కారు రావడం, లైట్లు మా మీదకు రావడంతో ఒక్కసారిగా పట్టు సడలించాడు. బతికానురా దేవుడా అనుకుంటూ పరుగెత్తి గొల్లప్రోలు చేరుకున్నాను. పిల్లలు అనాథలవుతారు. నీకు కావలిస్తే మరో రూ.2లక్షలు అప్పు ఇప్పిస్తానని చెప్పినా కనికరించలేదు అంటూ జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న రంపం గంగాధర్ నుంచి తృటిలో చావు నుంచి తప్పించుకున్న కుంపట్ల సూరిబాబు(బాబ్జి) నాటి సంఘటనలను తెలిపారు. ఆయన 16వ తేదీ రాత్రి జరిగిన సంఘటనలను మీడియాకు వివరించారు.

● తాడు పట్టుకుని బతికి బయటపడ్డాను
● కారు రావడంతో పరుగెత్తి గొల్లప్రోలు చేరుకున్నాను
● పిల్లలు అనాథలవుతారని కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు
● తాటిపర్తి జంటహత్యల సంఘటనలో తప్పించుకున్న కుంపట్ల సూరిబాబు



వివరాలు తెలుపుతున్న కుంపట్ల సూరిబాబు(బాబ్జి)

గొల్లప్రోలురూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన రంపం గంగాధర్ అదే గ్రామానికి చెందిన రంపం శ్రీను, తోరాటి సూరిబాబులను వారి వద్ద తీసుకున్న బాకీని తీరుస్తానని చెప్పి గ్రామశివారులోని పొలాల్లో ఉన్న బావి వద్దకు తీసుకువెళ్లి అందులో తోసివేసి హత్య చేయడమేగాక కుంపట్ల సూరిబాబు(బాబ్జి)పై హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈసంఘటనకు సంబంధించి సూరిబాబు తనకు ఎదురైన సంఘటనలు గురించి తెలిపారు. 16వ తేదీ రాత్రి 8గంటల సమయంలో గంగాధర్ పలుమార్లు తనకు ఫోన్ చేశాడని, ఆ సమయంలో తాను స్నానం చేస్తున్నట్లు సూరిబాబు చెప్పారు. తన భార్య ఫోన్ ఎత్తి స్నానం చేస్తున్నాడని చెప్పగా తాను తయారై వచ్చే వరకూ ఇంటి బయట గంగాధర్ వేచి ఉన్నాడని, తన దగ్గర తీసుకున్న అప్పునకు సంబంధించి వడ్డీ డబ్బులు ఇవ్వడానికి వచ్చాడని భావించానని తెలిపారు. గొల్లప్రోలు వెళ్లే దారిలో ఉన్న సుద్దగడ్డ కాలువలో సెల్‌ఫోన్ పడిపోయిందని, దానిని వెతికేందుకు వెళదామని చెప్పి తీసుకువెళ్లి మరలా వెనక్కి తీసుకువచ్చాడని చెప్పారు. టీ తాగుదామని చెబితే గొల్లప్రోలు, కత్తిపూడి వెళ్లదామంటే కాదని ధర్మవరం వెళ్లి టీ తాగి తిరిగి రాగా తాటిపర్తి ఊరులోకి రాగా వేగంగా పోనిచ్చి మరలా సుద్దగడ్డ కాలువ వద్దకు తీసుకువచ్చాడని తెలిపారు. ఎందుకు ఉదయం వెళ్లదామని తాను చెప్పగా ఫోన్‌లోని ఫోన్‌పేలో 1.10లక్షలు డబ్బులు ఉన్నాయని ఇప్పుడే వెళ్లాలని చెప్పాడన్నారు. కాలువ వద్దకు రాగానే తన మెడపై బలవంతంగా పట్టుకుని సుద్దగడ్డకాలువలోని నీటిలో ముంచేందుకు ప్రయత్నించాడని సూరిబాబు తెలిపారు. ఆ సమయంలో సుద్దగడ్డ కాలువ దాటేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న తాడు ఉండటంతో దానిని పట్టుకుని బతికి బయటపడ్డానని చెప్పారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారు అనాథలు అయిపోతారని గంగాధర్ కాళ్లు పట్టుకుని బతిమలాడానని, నీకు కావలిస్తే మరో 2లక్షలు అప్పు ఇప్పిస్తానని చెప్పానని తెలిపారు. అయినా కనికరించలేదని, సరిగ్గా అదే సమయంలో ఆ దారిలో వచ్చిన కారు లైటు మీద పడటంతో గంగాధర్ పట్టు సడలించాడని, వెంటనే పరుగెత్తి పారిపోయి గొల్లప్రోలులోని బంధువుల ఇంటికి వెళ్లి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. 17వ తేదీ ఉదయం పోలీసులు తిరిగి రమ్మని పిలిచిన తర్వాత ఇద్దరినీ నూతిలో తోసి చంపినట్లు తెలిసిందని చెప్పారు. రాత్రి సమయంలో గంగాధర్ సైకో మాదిరిగా వ్యవహరించాడని తెలిపారు.

బెదిరింపులకు భయపడి యువకుడి ఆత్మహత్య

తొండంగి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు తనను పలుమార్లు చంపుతానని బెదిరించడంతో భయపడిన తొండంగి గ్రామానికి చెందిన గాబు శివాజీ అనే యువకుడు గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తొండంగి పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారందించిన వివరాల ప్రకారం తొండంగి గ్రామానికి చెందిన మల్లిపాము గంగాధర్ (పండు) అనే యువకునికి వేరే యువతితో అక్రమ సంబంధం ఉందని గ్రామంలో శివాజీ ప్రచారం చేస్తున్నాడన్న అపోహతో అతనిపై కక్ష పెంచుకున్నాడన్నారు.గంగాధర్, అతని స్నేహితులు ఉమ్మిడి దేవిశ్రీ ప్రసాద్, మల్లిపాము తేజలు శివాజీని కొట్టి చంపుతామని పలుమార్లు బెదిరించారన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో కూడా గొడవపడ్డారన్నారు. వారం రోజుల కిందట శివాజీ ఒంటిమామిడి వైపు నుంచి వస్తుండగా శ్మశానం సమీపంలో ముగ్గురూ ఉండి బెదిరించారన్నారు. ఈ విషయాలు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు చెప్పాడన్నారు. ఈ నేపథ్యంలో భయపడిన శివాజీ 18 వతేదీ అర్ధరాత్రి గడ్డి మందుతాగి వాంతులు చేసుకుంటుండగా గమనించిన తల్లిదండ్రులు స్థానిక ఆసుపత్రికి, అక్కడినుంచి తుని తదుపరి కాకినాడ ఆసుపత్రిలకు చికిత్స నిమిత్తం తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారంరాత్రి మృతి చెందినట్లు వారు తెలిపారు. తన కుమారుడి మృతికి గంగాధర్, దేవిశ్రీప్రసాద్, తేజలే కారణమంటూ తండ్రి గాబు విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

తునిలో క్రేన్ ఢీకొని పాస్టర్ మృతి

● చర్చికి వెళుతుండగా ఘటన

తునిరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):చర్చికి వెళుతుండగా క్రేన్ ఢీకొని పాస్టర్ మృతి చెందిన ఘటన తునిపట్టణ రైల్వే ఫ్లైఓవర్‌పై జరిగింది. శనివారం సువార్త చెప్పేందుకు చర్చికు వెళుతుండగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఆవుల ప్రసాద్(28) క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దైవచింతన గల ప్రసాద్ నిత్యం ఏదో ఒక చర్చిలో సువార్త చెబుతూ జీవనం సాగిస్తాడు. ఎక్కడికైనా నడిచే వెళుతుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈక్రమంలో శనివార సాయంత్రం తుని పట్టణంలో ఒక చర్చికి వెళుతుండగా క్రేన్ ఢీకొనడంతో మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

బాలబాలాజీకి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే వేదమంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. శనివారం స్వామివారిని 3500మంది దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకంలో 1800మంది భోజనం చేశారని, రూ2,16,920 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ రాజు తెలిపారు.

యూరియా, ఎరువుల పంపిణీలో

నిబంధనలు బేఖాతరు

● ఒమ్మంగి సొసైటీ పరిధిలో నలుగురికి షోకాజ్ నోటీసులు



మండల వ్యవసాయాధికారి అమృత

ప్రత్తిపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా ఎరువుల పంపిణీలో నిబంధనలు బేఖాతరు చేసిన కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో నలుగురికి వ్యవసాయాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. యూరియా ఎరువుకు గడిచిన రెండు నెలలుగా డిమాండ్ ఏర్పడి కొరత నెలకొన్న పరిస్థితుల్లో ఒమ్మంగి సొసైటీకి మంజూరైన యూరియా ఎరువును కొందరికి అధిక మొత్తంలో అందజేయడంతో వ్యవసాయాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మంగి పీఏసీఎస్‌కు గత జూలైలో 62.700టన్నులు, ఆగస్టులో 30.250టన్నులు యూరియా మంజూరైంది. దాదాపు 93టన్నుల యూరియా ఈ సొసైటీ ద్వారా రైతులకు పంపిణీ చేశారు. యూరియా ఎరువు డిమాండ్ అధికంగా ఉన్న పరిస్థితుల్లో నలుగురిలో ఒకరికి 50బస్తాలు, ముగ్గురికి 40 బస్తాలు వంతున పంపిణీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 5ఎకరాలు ఉన్నప్పటికీ 20 బస్తాల వరకు పంపిణీ చేయవచ్చనే నిబంధన పాటించలేదు. దీంతో మండల వ్యవసాయాధికారి జోకా అమృత ఆధ్వర్యంలో వ్యవసాయాధికారుల బృందం ఈ సొసైటీలోని యూరియా పంపిణీపై విచారణ నిర్వహించారు. రైతులకు 50 బస్తాలు, 40 బస్తాలు వంతున నలుగురికి అందజేసిన వైనంపై వేలిముద్రలు వేసిన వారిని గుర్తించారు. సొసైటీ పరిధిలోని కొప్పన గంగారావు, రామకుర్తి వంశీ, నాగులాపల్లి బాలకుమార్, సుంకర గంగాధర రామారావులను గుర్తించి వీరికి వ్యవసాయాధికా రులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నలుగురు అపరాధ రుసుము చెల్లించే విధంగా వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఆగస్టులో వచ్చిన యూరియా ఎరువు పంపిణీ విషయంలో రైతులకు యూరియా ఎక్కువ అవసరం ఉన్న కారణంగా ఎరువుల లారీ వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున రైతులు ఒకేసారి లారీ వద్దకు రావడంవల్ల స్టాక్ డీపీటీలో నమోదు చేయకుండా అందజేశామని సేల్స్‌మ్యాన్ గొల్ల శివకుమార్ లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ విషయంలో తప్పిదం జరిగిందని శివకుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు గురుకులం విద్యార్థినుల ఎంపిక

ఏలేశ్వరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జగ్గంపేటలో నిర్వహించిన అం డర్-19 జూడో పోటీలలో గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ రోజారమణి తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లోనూ కీర్తన, సాయి లావణ్య, రమ్యలు సత్తాచాటుతున్నారన్నారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.



ఏలేశ్వరంలో జూడో పోటీలకు ఎంపికైన గురుకులం విద్యార్థినులు

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

● నలుగురు దొంగల అరెస్టు
● రూ.75వేల విలువైన చోరీ సొత్తు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో అన్నవరం ఎస్ఐ హరిబాబు

అన్నవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్లు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. కాకినాడ ప్రాంతానికి చెందిన పాలెపు సతీష్, బలసాడి దనుష్, బర్రికల లక్ష్మణరావు, వంతాడ సత్యసాయిలు దొంగతనాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకోవడంతో నిఘాపెట్టి కత్తిపూడి శివారులో అరెస్టు చేశామని వీరివద్ద నుంచి వెండిచెంబు, జత వెండిపట్టీలు, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.



లఘు చిత్రాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినీ ప్రముఖులు

వేడుకగా లఘు చిత్రాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): భాషా, సాహిత్యం, కళలు, ఇతర ఆచారాలను గౌరవించడం ద్వారానే తెలుగు వికాసం, సంస్కృతి రక్షించబడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు భారతీయ విద్యాభవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 సన్నాహాల్లో భాగంగా శనివారం తెలుగు భాషా వికాసంపై ఎంపిక చేసిన 44 లఘు చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్టీఆర్ తన చిత్రాల ద్వారా భాష ఉన్నతికి కృషిచేశారని, ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు మాట్లాడుతూ జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. గ్రాంధిక భాష నుంచి వ్యవహారిక భాష ప్రాధాన్యతను గుర్తించి దాని అభివృద్ధికి కృషిచేసిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషోద్యమ పితామహుడు అని కొనియాడారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ ప్రత్యేక మంత్రిత్వశాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ వేమన, సుమతి శతకాలు ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా మిగిలేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. అనంతరం ప్రదర్శించిన లఘు చిత్రాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం నిర్మించి దర్శకత్వం వహించిన కృత్రిమ మేధస్సుతో రూపొందించిన 'తెలుగు వెలుగు గొడుగు గిడుగు" లఘు చిత్రం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో వివిఐటీ విసి వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్, సినీ ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డివై చౌదరి, బివిఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆక్రమణకు దౌర్జన్యం

● పట్టపగలే కిరాయి మూకల దురాక్రమణ!

కాకినాడక్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యు మెంట్లతో ఓ ఇంటిని ఆక్రమించుకునేందుకు పట్టపగలే కిరాయి మూకలు కాకినాడ సూర్యనారాయణపురంలో దుకాక్రమణకు పాల్పడిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. మన్యం నాగేశ్వరరావు కుటుంబం స్థానిక 28వ వార్డులో వారి వీధిలో తన సోదరి గుండు సత్యవతి ఇంట్లో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఇటీవల సోదరి మరణించింది. అంతకుముందు సోదరుడు నాగేశ్వరరావు పేరుపై తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. ఈ క్రమంలో ఇంటికి మరమ్మతులు చేయించుకుని ఆ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం కొంతమంది దుండగులు అకస్మాత్తుగా నాగేశ్వరరావు ఇంట్లోకి చొరబడ్డారు. నకిలీ పత్రాలతో ఇంట్లోకి వచ్చి ఈ ఇల్లు ఖాళీ చేయాలని లేదంటే పరిణామా లు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ హఠాత్ పరిణామానికి ఖంగుతిన్న నాగేశ్వరరావు తేరుకుని ఈ ఇల్లు తనదని, ఈ ఇంట్లోకి అక్రమంగా ఎలా ప్రవేశిస్తారని ప్రశ్నించాడు. ఈ ఇంటిపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో కోట్లాది రూపాయల విలువైన ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్నించడంతో తగాదా జరిగింది. దాంతో రెచ్చిపోయిన కిరాయి మూకలు నాగేశ్వర రావుపై దాడి చేసేందుకు ప్రయత్నించడం, భార్య కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. తన ఇల్లు కబ్జాకు ప్రయత్నిస్తున్న కిరాయి మూకల నుంచి తనకు రక్షణ కల్పించి, దుండగులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

సేవ్ గర్ల్ చైల్డ్ జిల్లాస్థాయి పోటీలు


పోటీలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ కోమల తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 11వ తేదీన ఇంటర్నేషనల్ సేవ్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా శనివారం హైస్కూల్ బాలికలకు వివిధ అంశాల్లో జిల్లాస్థాయి ఫైనల్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్లో బాలికల రక్షణ, వారి హక్కులు, సమాజంలో వారి ప్రాధాన్యతపై ఎస్సే రైటింగ్, సమాజ అభివృద్ధికి బాలిక విద్య ఎందుకు ముఖ్యమైనది అనే అంశంపై వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల మాట్లాడుతూ బాలికల రక్షణ, సమాన హక్కులు, విద్యకు ప్రాధాన్యతను సమాజానికి చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. జిల్లా ఇన్‌ఫెక్షన్స్ అధికారి దిలీప్‌కుమార్, డెమో సత్యకుమార్, ఎస్‌కేవీటీ హైస్కూల్ హెచ్‌ఎం మల్లేశ్వరరావు తదితరుల పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ కీలకం

జీజీయూ ప్రొ వైస్ ఛాన్సలర్ రాజు

రాజానగరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, కేసులను ఛేదించడంలో ఫోరెన్సిక్ సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు అన్నారు. గైట్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఫోరెన్సిక్ సైన్స్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పలు ముఖ్యమైన కేసుల దర్యాప్తులో ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచే ఈ ఫోరెన్సిక్ సైన్స్ అధునాతన సాంకేతికతతో అభివృద్ధి చెందుతూనే ఉందన్నారు. తదుపరి కళాశాలలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను, ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ ఇన్‌చార్జి విభాగాధిపతి తబసం, కోఆర్డినేటర్ గౌతంసాయి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్మార్ట్ ఇండియా హ్యాక్థాన్-2025లో భాగంగా జీజీయూలో ఇంటర్నల్ హ్యాక్థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ సమస్యకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.జయా నందకుమార్, మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో ఆలిండియా బెస్ట్ ఫిజిక్ పోటీలు!

ఉపకులపతి ప్రసన్నశ్రీ


రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో త్వరలో అఖిల భారత బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహించనున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఇండియన్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ (ఐబీబీఎఫ్) అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్ విశ్వవిద్యాలయంలో వీసీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో వివిధ క్రీడాపోటీల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ అఖిల భారత బెస్ట్ ఫిజిక్ పోటీలు నన్నయ వర్శిటీలో నిర్వహించేందుకు ఆల్ ఇండియా విశ్వవిద్యాలయాల నుంచి అనుమతులు లభించాయని, విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు సమావేశం నిర్వహించి ఈ పోటీల నిర్వహణ కమిటీలు, తేదీలు ఖరారు చేస్తామన్నారు. కాగా నన్నయ వర్శిటీ నిర్వహించబోయే బెస్ట్‌ఫిజిక్ పోటీలకు ఐబీఎఫ్ చేయూతనిస్తుందని రమేష్‌కుమార్ తెలిపారు. అనంతరం ఆయనను వీసీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యకమంలో వ్యాయామ అధ్యాపకులు, కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి

బొమ్మూరు సబ్‌స్టేషన్ వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు


బొమ్మూరులో రిలే నిరవధిక దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో సెంట్రల్ జేఏసీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద రాజమహేంద్రవరం జేఏసీ చైర్మన్ జగతా అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కన్వీనర్ పీవీ కుమార్ మాట్లాడుతూ డీఏ బకాయిలు విడుదల చేయాలని,కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పని సమాన వేతనం కల్పించాలని, వారిని సంస్థలో విలీనం చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రియాంక, వై.అర్జున్, సాంసన్ రాజు, పి.విజయ శ్యామల, నాగేశ్వరరావు, అన్నవరపు ప్రసాద్ సుబ్బారావు, నాగేశ్వరరావు, చంద్రశేఖర రెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

బిక్కవోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణతో పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుదలతో పాటు మగ పశువుల్లో పని సామర్థ్యం పెరుగుతుందని మండల పశు వైద్యాధికారి తిరుమలరావు సూచించారు. రంగాపురంలో శనివారం ఆయన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను 80 పశువులకు పశువులకు అందించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోయి, పని సామర్థ్యం తగ్గుతుందని, పాలు తాగే దూడల్లో మరణాలు సంభవిస్తాయన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ సందర్భంగా టీకాల కార్యక్రమ పోస్టర్‌ను కూటమి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, నడింపల్లి చిరంజీవిరాజు, కానాటి అప్పలస్వామి, చెల్లే జోష్‌బాబు,ఏహెచ్‌ఏ భూపతిరాజు, పంచాయితీ కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

యువ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్-2025లో మంచి విజయాలు సాధించి జిల్లా గౌరవం పెంచిన మీరంతా ఇతరులకు ఆదర్శమని కలెక్టర్ కీర్తి చేకూరి యువ క్రీడాకారులను అభినందించారు. విశాఖపట్నంలో ఆగస్టు 29న నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ కప్‌లో తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించారు. దీంతో శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో యువ క్రీడాకారులను కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువ క్రీడాకారుల కృషి ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

తంటికొండ-గోకవరం రహదారిపై కూలిన చెట్టు

గోకవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా వర్షం కురవడంతో రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తంటికొండ-గోకవరం ప్రధాన రహదారి మధ్యలో గాలి జోరుకు ఓ చెట్టు నేలకూలింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.అదే సమయంలో ఆ రహదారి గుండా ప్రయాణం చేస్తున్న టీడీపీ నాయకుడు బదిరెడ్డి బాబి చొరవ తీసుకొని స్థానికుల సహాయంతో రోడ్డు పైనుంచి చెట్టును తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

తాళ్లపూడిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

తాళ్లపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వస్తువులపై జీఎస్టీ తగ్గించడంపై ఆనందోత్సవాలు ప్రకటిస్తూ మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ మాట్లాడుతూ మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని చేపట్టిన సేవా పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా తాడిపూడిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తిరుమలశెట్టి కృష్ణ,



వెటుగుబంటి బాలకృష్ణ, గోకవరపు జితేంద్ర రవి, నామా రంగనాయకులు,మల్లిపూడి రాజేష్, ప్రగడా సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్రకళపై విద్యార్థులకు అవగాహన

రాజహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్రకళపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన చిత్రకళా సమ్మేళనంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల విద్యార్థులకు, దామెర్ల ఆర్ట్ గేలరీలో చిత్రకళపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు
- గోకవరంలో పారిశుధ్య కార్మికులకు సత్కారం


గోకవరంలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

అనపర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని, ప్రతిఒక్కరూ తల్లి పేరుతో మొక్కను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. అనపర్తి మండలం పొలమూరు, రంగంపేట గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. అనపర్తి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి స్వచ్ఛ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. అలాగే రంగంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: గ్రీనరీ కాన్సెప్ట్‌లో భాగంగా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పచ్చదనాన్ని పెంచుతూ ఆక్సిజన్ ఇచ్చే ఇండోర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పచ్చదనంతో వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. డిపో ఆవరణలోని పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించారు. పచ్చదనాన్ని కాపాడుతామని ఆర్టీసీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మాధవ్, స్టేషన్ మేనేజర్ ఏవీ రావు,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో పొడిచెత్త సేకరించి సేంద్రీయ ఎరువుల తయారీ కోసం కంపోస్టు కుంటలో వేశారు. రాజమహేంద్రవరంలోని రీజనల్ ఫారెస్ట్ సెంటర్ రాష్ట్ర సెల్వికల్చరిస్ట్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయన రహిత ఆహారం శరీరానికి రక్షణ కవచం అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, కోఆర్డినేటర్ జి.రవితేజ, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మండలంలోని పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు జరిపి మెడికల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో మేనేజర్ మార్గరేట్ వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం ఆమె పరిసరాలను పరిశుభ్రత విషయంలో పాటించవలసిన జాగ్రత్తలను ప్రయాణికులకు, డిపో పరిధిలోని దుకాణాదారులకు డీఎం వివరించారు.

బిక్కవోలు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వి.శ్రీనివాస్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఏవో నాగేంద్రప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు.


బిక్కవోలులో మొక్క నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
స్వస్థ నారీ సశక్తి పరివార్


రాజమహేంద్రవరంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు, ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 5వ డివిజన్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద శనివారం స్వస్థ నారీ సశక్తి పరివార్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన రక్తపరీక్షలు జరిపి మందులు అందజేస్తున్నామన్నారు. దీని కారణంగా ఆసుపత్రులకు వచ్చే పేషెంట్ల సంఖ్య పెరుగుతోందన్నారు. థైరాయిడ్ టెస్ట్‌లు యూహెచ్‌సీలలో అందుబాటులో ఉండాలని పలువురు కోరగా ఈ సెంటర్లలో రక్తనమూనాలు తీసి ఇతర ల్యాబ్‌లలో పరీక్షలు జరిపించి, రిపోర్టులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోమలికి సూచించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు.కార్యక్రమంలో యూహెచ్‌సీ డీసీ చైర్మన్ అనసూరి శ్రీనివాస్, నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, మళ్ల వెంకట్రాజు, జక్కంపూడి అర్జున్, బర్ల గిరిజ, బేసరి చిన్ని, బొర్రా చిన్ని, తంగెళ్ల శ్రీనివాస్, తంగెళ్ల పద్మావతి, వైద్యాధికారి మల్లాడి కృష్ణ అనూహ్య, గైనకాలజిస్ట్ జ్యోత్స్న, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి ప్రారంభించగా వైద్యులు 50 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, సొసైటి డైరెక్టర్ కొర్ల వినాయకరావు, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. బిక్కవోలు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో ఊలపల్లి సొసైటీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 96 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు.

కడియం: మండలంలోని వీరవరం, వేమగిరిగట్టు గ్రామాల్లో వైద్యాధికారిణి డాక్టర్ మణిజ్యోత్స్న,డాక్టర్ ఎస్.జెస్సీసుప్రియ వైద్య శిబిరాలు నిర్వహించారు. వీరవరంలో బత్తుల రాము, ఆదిమూలం సాయి, పెద్దబ్బు, నేతల పాపారావు, గోరు నాగేశ్వరరావు, వేమగిరిలో జంగా వినోద్, బొల్లాడి జాన్, పీతల ముత్యాలరావు, సురేష్, ధర్మదాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ జ్ఞాన చంద్ర ఆధ్వర్యంలో కోరుకొండ పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, మునగాల గ్రామ సచివాలయంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మీకాంతం, హెచ్ఎస్ యెజ్జు ఉమాపార్వతీశం, సర్పంచ్ నాగులాపల్లి మాణికుమారి, ఎంపీటీసీ చింతాకుల రాజు,మండపాక శ్రీను, బాబీ, వెంకటరాజు, అప్పారావు, కొండపల్లి హరి, కడియం ఏసురత్నం పాల్గొన్నారు.


కోరుకొండలోప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్దిష్టంగా ప్రకటించాలి: సీపీఎం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్ను తగ్గింపునకు సంబంధించి ప్రస్తుతం మార్కెట్లో ఎంత రేటు ఉన్నదీ, జీఎస్టీ తగ్గింపు తర్వాత ఎంత తగ్గుతుందీ అనేది నిర్దిష్టంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇప్పటికే కొన్ని డెయిరీలు పాల ఉత్పత్తులపై ధరలు తగ్గిస్తూ ప్రకటించాయని, అలాగే అన్ని సరుకుల ధరల తగ్గింపుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పండుగ సందర్భంగా ఇచ్చే డిస్కౌంట్లను పన్ను తగ్గింపుగా ప్రచారం చేసి లాభాలు పొందాలని కొన్ని కార్పొరేట్ కంపెనీలు చూస్తున్నాయని, ఈ మోసాన్ని అరికట్టాలని ఆయన పేర్కొన్నారు.

డిజిటలైజేషన్‌పై అవగాహన

బిక్కవోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు ఇండస్, ఎస్ఎస్‌డీ సంస్థల ఆధ్వర్యంలో డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని యూనియన్ బ్యాంకుకు తీసుకెళ్లి బ్యాంకులో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ ఇటువంటి ఇండస్ట్రియల్ టూర్ వల్ల విద్యార్థుల్లో వివిధ సాంకేతిక అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థల ఆర్డీవో ధరహాస్, టీచర్ కుసుమ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. పొలమూరులో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు


పొలమూరులో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన పెంచాల్సిన బాధ్యత అంగన్‌వాడీలదేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొలమూరులో ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 66 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు,చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ తల్లీబిడ్డ సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. బిడ్డకు తల్లి పాలు తప్పక అందించాలని, పాలివ్వడం ద్వారా మహిళల్లో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి విముక్తి కలుగుతుందన్నారు. పీడీ శ్రీదేవి ప్రసంగిస్తూ గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, కార్పొరేషన్ల డైరెక్టర్లు బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ చాయాదేవి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, వెలుగుబంటి సత్తిబాబు, రావాడ నాగు, మల్లిడి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అక్కినేని జయంతి

రాజహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని శనివారం సాయంత్రం స్థానిక గోకవరం బస్టాండు సమీపంలోని జిత్‌మోహన్ మిత్ర కళావేదికలో నిర్వహించారు. పలువురు నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ తాను నాగేశ్వరరావుతో నటించడమే కాకుండా, తన ఆర్కెస్ట్రా ద్వారా అక్కినేనిని సన్మానించినట్టు చెప్పారు.రాజమహేంద్రవరంలో అక్కినేని కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడానికి కృషి చేశానన్నారు. అనంతరం,మన అక్కినేని పుస్తకాన్ని, తాళం మణిధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అక్కినేని అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఎస్ఆనంద్, బి.సీతారామారావు, గిరాజాల సోమరాజునాయుడు, గుంటూరి శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.


అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కంప్యూటర్ సైన్స్‌లో ఉమకు పీహెచ్‌డీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20(ఆంధ్ర.జ్యోతి) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం నుంచి దారపు ఉమ పీహెచ్‌డీ పూర్తి చేశారు. అవార్డు కాపీని వీసీ ప్రసన్నశ్రీ శనివారం ఉమకు అందజేశారు. మీన్ షిఫ్ట్ విజన్ ట్రాన్స్‌ఫార్మర్(ఎంఎస్‌వీఐటీ) ద్వారా కథ చెప్పడంలో నూతన విధానాలు మార్ఫోలాజికల్ ఓపెన్ విజన్ ట్రాన్స్‌ఫార్మర్ (ఎంవోవీఐటీ) సహాయంతో చిత్రాల పునఃవివరణ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ఈ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలపై వైసీపీ రాద్ధాంతం

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేసినా ఆ సంస్థ, ట్రస్ట్ కానీ ప్రభుత్వ గైడ్‌లెన్స్ ప్రకారం పనిచేస్తుందని, వైసీపీ వాళ్లు మెడికల్ కళాశాలలపై రాద్ధాంతం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. శనివారం స్థానిక జేఎన్ రోడ్డులోని వి కన్వెన్షన్ హాలులో 11 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసి కొంతకాలం తరువాత ఆ ఆస్తి ప్రభుత్వానికి అప్పగిస్తారని, పీపీపీకి ప్రైవేటుకు తేడా తెలియని వైసీపీ నాయకులు ఆందోళనలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. గతంలో వైసీపీ పాలనలో సెల్ఫ్‌ఫైనాన్స్ స్కీం పేరుతో జీవో నెంబరు 107, 108, 133లు జారీ చేశారని మోసం చేయడం అంటే అది అని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కళాశాల బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ హాస్టళ్లలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ఓఎన్‌జీసీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ కేటాయించేలా సహాయసహకారాలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారిణి బి.శశాంక కోరారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని బీసీ సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతిగృహానికి ఓఎన్‌జీసీ ఓబీసీ అసోసియేషన్ సుమారురూ.50,000 విలువ చేసే పరికరాలను వితరణ చేశారు. ఫ్యాన్లు, ట్యూబులైట్లు, సింటెక్స్ వాటర్ ట్యాంకు, వోల్టాస్ వాటర్ ఫిల్టర్, పోటీ పరీక్షలకు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో ముత్యాల సుబ్బారావు, హెచ్‌డబ్ల్యూవో పీపీపీ కుమారి, అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న గుంటూరులో యూటీఎఫ్ రణభేరి


యూటీఎఫ్ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యారంగసమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 25న గుంటూరులో జరిగే యూటీఎఫ్ రణభేరి బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, కార్యదర్శి సీహెచ్ దయానిధి కోరారు. ఈ మేరకు పోస్టరును శనివారం దివాన్‌చెరువులో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి డీఏలు విడుదల చేయాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రమోషన్లు కల్పించాలని, సీపీఎస్ రద్దు చేయాలన్నారు.

మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే లక్ష్యం

గోకవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే తన లక్ష్యమని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కంబాల కానుక వనితల వేడుక అనే కార్యక్రమం ద్వారా శనివారం స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో సుమారు 2000 మంది మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 8 వేల చీరలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు పెద్దాడ వెంకన్నదొర, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, దేశాల నరేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో భవిష్యత్‌కు ముప్పు

- జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్‌ను నియంత్రించాలి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై ప్రభావాన్ని చూపే ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రభుత్వ కార్యక్రమంలా భావించకుండా..మన ఆరోగ్యానికి ఉద్దేశించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం అని స్పష్టం చేశారు. గతంలో గుడ్డ సంచులు, జ్యూట్‌బాగులు వినియోగించేవారని కాలక్రమేణా వాటి వినియోగం తగ్గిందన్నారు. మళ్లీ వాటి వినియోగం పెరగాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్లాసి క్ వినియోగాన్ని నియంత్రించాలన్నారు. సెప్టెంబర్ నెల గ్రీన్ ఏపీ కాన్సెప్ట్‌లో భాగంగా అడవుల పెం పకం ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.దీనిలో భాగంగా ప్లాంటేషన్ డ్రైవ్‌లు, అర్బన్ టెర్రస్ గార్డెనింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచే వారిని ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఆర్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆర్‌వీ.రామలింగేశ్వరరావు, ఎంహెచ్‌వో వినూత్న తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్సీ సోము


బొమ్మూరులో మొక్కను నాటుతున్న హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తదితరులు


కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్ పరిసరాలను చీపుర్లు పట్టుకుని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, చైర్‌పర్సన్ రత్నకుమారి

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.. నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములయ్యారు.. కొంత మంది పారిశుధ్యం మెరుగుపర్చగా.. మరికొంత మంది మొక్కలు నాటారు.. ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

మాకు సీట్లు కావాలి..



స్త్రీలకు మాత్రమే.. గతంలో ఆర్‌టీసీ బస్ ఎక్కితే ముందు వరుసలో కొన్ని సీట్లు వెనుక పెద్ద పెద్ద అక్షరాలతో కనిపించేవి.. మరి నేడు ఏ బస్‌లో చూసినా మహిళలే ఉంటున్నారు.. అన్ని సీట్లలో వాళ్లే కూర్చుంటున్నారు. అందుకే పురుషులకు మాత్రమే అని కొన్ని సీట్లకు బోర్డులు ఏర్పాటుచేయాలి.. ఓ ప్రయాణికుడి డిమాండ్ ఇది..

అమ్మగారింటికి వెళ్లానంతే..!



ఓ భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాడు. భార్య కనిపించలేదు. కంగారుపడి ఇల్లంతా వెతికాడు. చివరికి ఫోన్ చేశాడు. మా అమ్మవాళ్ల ఇంటికి కూర ఇవ్వడానికి వచ్చానని అవతల నుంచి సమాధానం వచ్చింది. 10 కిలోమీటర్ల దూరం.. వారానికి ఐదుసార్లు ఇదేం పని అని భర్త కాస్త కోపగించుకున్నాడు. బస్సు ఫ్రీయే కదా అని!.. భార్య సమాధానం విని భర్తకు దిమ్మతిరిగింది.

అబ్బే ఏమీ చేయనండి...

రాజమహేంద్రవరంలోని ఓ గృహిణి ఈమధ్య ఉదయం భర్త ఆఫీసుకు వెళ్లగానే ఆమె కూడా ఇంటికి తాళం వేసి వెళ్లి.. సాయంత్రం ఇంటికి చేరుతోంది. కొద్దిరోజుల తర్వాత పక్క వాటా ఆవిడ పలకరించి ఏదైనా ఉద్యోగంలో చేరారా ఆరాతీసింది. అబ్బే నేనేమీ చేయనండి.. ఫ్రీ బస్ కదా.. తునిలో ఉన్న మా అమ్మగారింటికి వెళ్లి వస్తున్నానంతే.. ప్రశ్నించిన మహిళకు నోట మాట రాలేదు మరి..!

పిలవడమే ఆలస్యం.. !



ఇటీవల కొవ్వూరులో ఒక ఇంట్లో ఒక వేడుక చేసుకున్నారు.. ఆ ఇంటావిడ.. అమ్మగారి ఊరెళ్లి వాళ్ల వీధిలో ఉన్నవాళ్లందరికీ ఫంక్షన్‌కు రావాలని చెప్పి వచ్చేసింది.. ఆ వీధిలోని మహిళలు ఒక్కరూ ఆగలేదు.. తెలిసినోళ్లు.. తెలియనోళ్లు యాభై మందిపైనే వచ్చి వెళ్లారు.. దాంతో ఆ ఇంటావిడకు ఏం చేయాలో పాలుపోలేదు..



బస్టాండ్‌లో రెడీ..గా దూరప్రాంతాలకు ప్రయాణం చేసే మహిళలు..ఆర్టీసీ బస్టాండ్లలోనే అన్ని పనులు చేసుకుంటున్నారు.. శనివారం రాజమండ్రి ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఒక మహిళ జుట్టు దువ్వుకుంటూ ఇలా కనిపించింది.

ఆదివారం.. ప్రత్యేకం

ప్రయాణంలో.. పదనిసలు!



బస్..కిక్కిరిసి : రాజమండ్రి బస్టాండ్‌లో మహిళల పోటాపోటీ

మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాలను తెచ్చింది. అయితే స్త్రీ శక్తికి .. ప్రగతిశక్తి వణికిపోతోంది.కొసరు పనులపై ఎక్కువగా ప్రయాణాలు చేస్తుండడం, అవసరం లేకపోయినా 'ఫ్రీయే కదా!' అనే ధోరణి అవలంబిస్తుండడంతో నిజంగా అవసరం ఉన్న మహిళలు నరకం చూస్తున్నారు. వృద్ధులు, పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, విద్యార్థులు, రోజు వారీ అవసరాలపై తిరిగేవాళ్లు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లో లక్షలాది మంది మహిళలు ఉచితంపై ప్రయాణాలు సాగించారు. పథకం రాక మునుపుకంటే రెండింతలు పైనే మహిళలు ప్రయాణిస్తున్నారని తేలింది. పరిమితికి మించి ప్రయాణి కులు ఎక్కడం నిషేధమైనా ఆ నిబంధన బస్సెక్కింది. దీంతో బస్‌ల మైలేజీ లీటరు డీజిల్‌కు 5.50 కి.మీ నుంచి 5కి తగ్గింది. టైర్ల అరుగుదల వేగమైంది. ఇలా విభిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కొత్త బస్సులు కావాలి

ఆర్టీసీలో కొత్త బస్సుల అవసరత కనిపిస్తోంది. తూర్పుగోదావరి, కాకినాడకు చేరో 50 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు వస్తాయని చెబుతున్నారు. అవి ఫిబ్రవరికి వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు 50 బస్సుల చొప్పున కొత్తవి కావాల్సిందే. తూర్పుగోదావరి జిల్లాలో 285, కాకినాడ 291, కోనసీ మలో 300 కలిపి 876 బస్సులు ఉండగా.. 600 వరకూ ఉచిత ప్రయాణాలకు తిరుగుతున్నాయి.

- రాజమహేంద్రవరం/ అర్బన్/ కొవ్వూరు/నిడదవోలు/ కాకినాడ కార్పొరేషన్/ పిఠాపురం/సామర్లకోట/ ఆత్రేయపురం/రావులపాలెం

బంధువుల ఇళ్లకు క్యూ

నగరాలు, పట్టణాలకు పరిసరాల్లో ఉన్న గ్రామాలకు చెందిన మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఒకప్పుడు పెద్ద పెద్ద పనులు ఉంటేనే బస్సు ఎక్కే మహిళలు.. ఇప్పుడు చిన్నచిన్న అవసరాలకు, చిన్నచిన్న ఆనందాలకు బస్సులెక్కి పట్టణాలకు వస్తున్నారు. కొందరు బంధు వుల ఇళ్లకు క్యూకడుతున్నారు. మరి కొందరు షాపింగ్ చేస్తున్నారు.. ఇంకొందరు ఆలయాలకు వెళుతున్నారు.. ప్రతి బస్‌కి సుమారు 56 సీట్లు ఉంటాయి.. కానీ పలు రూట్లలో 100 నుంచి 120 మంది బస్సు ఎక్కుతున్నారు. దీంతో బస్ కిక్కిరిసిపోతోంది.

ఆలయాలకు వెళుతున్నాం..



మాది పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు. కాకినాడలో 11 రోజులపాటు జరగనున్న శ్రీపీఠం మహాశక్తి యాగంకి మేమంతా రావడానికి ఉచిత బస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతిరోజు గ్రూపుగా వచ్చి వెళుతున్నాం. చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు. - విజయలక్ష్మి, మార్టేరు

- స్త్రీ శక్తికి.. ప్రగతి శక్తి వణుకుతోంది
- అధిక బరువుతో ప్రయాణిస్తున్న బస్సులు
- తగ్గిపోయిన మైలేజీ.. పెరిగిన సమయం
- నిత్య ప్రయాణికులకు ఆపసోపాలు
- నెలలో.. హ్యాప్రీ ఖర్చు రూ.23 కోట్లు

ఇదీ ఆలోచించాల్సిందే!

ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగుల్లో రోజువారీ ప్రయాణికుల కోసం కొన్నింటిని కేటాయించినా లేదా ఆ సమయాల్లో మహిళ రద్దీ తక్కువగా ఉండేట్లు చూసినా ఉద్యోగినులు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.



వైజాగ్ నుంచి వాడపల్లి వచ్చాం..

విశాఖపట్నం కంచరపాలెం నుంచి వాడపల్లి వచ్చాం. ఇది నాల్గో శనివారం. తుని వరకూ బస్సులో వెళ్లి అక్కడి నుంచి అనకాపల్లి- విశాఖపట్నం వెళతున్నాం.

హ్యాప్రీగా తిరిగొస్తున్నారు!



పుణ్యక్షేత్రాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని ప్రతి శనివారం 50 వేల నుంచి 70 వేల మంది భక్తులు దర్శించుకుంటారు. వీరిలో మహిళా భక్తుల శాతమే అధికం. ఉచిత బస్ ద్వారా వాడపల్లి చేరుకుంటున్న మహిళలు మాడవీధుల్లో ప్రదక్షిణలు చేసి ఉచిత దర్శనం చేసుకుంటున్నారు. ఉచిత అన్నప్రసాదం స్వీకరించి మళ్లీ ఉచిత బస్సు ద్వారా మహిళలు తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. అన్నవరం, అంతర్వేది, అయినవిల్లి, బిక్కవోలు లక్ష్మీగణపతి, పిఠాపురం పాదగయ క్షేత్రాలకు భక్తులు వెళుతున్నారు.

డ్రైవర్‌గారు.. మీరు ఫ్రీ కదా!



డ్రైవర్‌గారూ ఒకసారి మా అబ్బాయిని పట్టుకోండి.. బస్ ఎక్కిన తరువాత తీసుకుంటా.. శనివారం రద్దీగా ఉండడంతో రావులపాలెం బస్టాండ్‌లో ఒక మహిళ తన కుమారుడిని డ్రైవర్‌కు ఇచ్చి బస్సెక్కింది.

కండక్టర్లు, డ్రైవర్లకూ ఇబ్బందే..

మహిళా బస్సు ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడంలేదు. సీటు కోసం పోటీపడే క్రమంలో టికెట్ తీసుకోవడం మరిచిపోతున్నారు. కొంతమంది అవగాహన లేక ఆధార్‌కార్డు తెచ్చుకోకుండా కండక్టర్లతో వివాదానికి దిగుతున్నారు. ఇంకొందరు ఉచితమే కదా దానికి టికెట్ ఎందుకని గొడవ పడుతున్నారు. ఎక్కడైనా చిన్నచిన్న తగాదాలు కండక్టర్లకు తలనొప్పిగా మారుతున్నాయి.



నెల ఖర్చు రూ.23 కోట్లు

జిల్లా	ప్రయాణికులు	రాబడి	ఫ్రీ టిక్కెట్లు	ఫ్రీ..మొత్తం	ఆక్యుపెన్సీ
కాకినాడ	34,46,175	20,23,54,098	21,18,454	7,68,36,103	61%
కోనసీమ	35,66,319	18,46,74,118	22,51,745	6,86,52,333	63%
తూర్పు	14,49,840	8,69,21,736	25,00,354	8,22,85,982	63%
ఉమ్మడి జిల్లా	84,62,334	47,39,49,952	68,70,553	22,77,73,822	62%

ఇవీ మా ఇబ్బందులు..

మాకు ఊపిరిసలపడంలేదు..



మహిళలకు ఉచిత ప్రయాణంతో కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. మహిళలతో బస్‌లు నిండిపోవడంతో బస్‌లో తిరగడానికే కష్టంగా ఉంటుంది. బస్‌లో ఊపిరిసలపడం లేదు. ఐనా ఓపికగా సహకరిస్తున్నాం.
- ఎస్ఎస్ఎస్.రావు, కండక్టర్, రావులపాలెం

దగ్గర దూరం వాళ్లే ఎక్కేస్తున్నారు..



మా బస్ నిడదవోలు నుంచి కాకినాడకు వెళుతోంది. మా బస్సులో దగ్గర దూరం మహిళలు ఎక్కేస్తున్నారు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.
- సుధీర్, కండక్టర్, నిడదవోలు

టిక్కెట్లు కొట్టి.. బస్‌లు నడపలేం..



సింగిల్ క్రూ విధానంలో నడిపే బస్సులకు డ్రైవర్లకు టిమ్ ఇస్తున్నారు. ఒకవైపు మహిళలను బస్సులో ఎక్కించాలి, మరోవైపు టిక్కెట్లు కొట్టాలి. ఈ దశలో బస్సులు నడపడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.
- దుర్గారావు, డ్రైవర్, ఏలేశ్వరం

ఆధార్ ఒరిజినల్ తేవాలి..



మహిళలు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొస్తే సమయం కలిసొస్తుంది. కొంత మంది జిరాక్స్, మరికొంత మంది మొబైల్ ఫోన్‌లో తీసి చూపుతున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతోంది.
- సత్యవతి, కండక్టర్, కాకినాడ

జనసేన రాజమండ్రి అర్బన్ ఇన్‌చార్జిగా అనుశ్రీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జనసేన రాజమహేంద్రవరం అర్బన్ ఇన్‌చార్జిగా అనుశ్రీ (అత్తి) సత్యనారాయణనే పార్టీ అధిష్ఠానం మళ్లీ నియమించింది. గతంలో జనసేన అధినేత, పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు సినిమా విడుదలలో కొందరు చేసిన రాజకీయం వల్ల అనుశ్రీని రాజమహేంద్రవరం అర్బన్ ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన జనసేనలోనే ఉన్నారు. కూటమి నేతలతో కూడా కలిసిపోయారు. అయితే గతంలో ఓ సినీ నిర్మాత చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను తప్పించింది. తర్వాత ఆయన పనితీరును గుర్తించిన అధిష్ఠానం

ఉత్తర్వులు విడుదల చేసిన అధిష్ఠానం

తిరిగి ఆయననే అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.పవన్ కల్యాణ్ నిర్ణయం ప్రకారం ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను తొలగించి, తిరిగి నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు జనసేన అధ్య క్షుడు రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

మరింత కసిగా పనిచేస్తా : అనుశ్రీ

తనపై తమ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఉంచిన నమ్మకంతో మరింత కసిగా పార్టీకోసం పనిచేస్తా. పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉంటా.

పెద్దేవంలో పశువులకు థైలేరియాసిస్

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దేవంలో గేదెలకు సోకిన అంతుచిక్కని వ్యాధిని గుర్తించి అధికారులు చికిత్స అందిస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో పశుసంవర్థకశాఖ అధికారులతో సమీక్షించారు. పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో పశువుల మరణాలను అసెంబ్లీ వేదికగా మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. మృతిచెందిన పశువులకు సంబంధించి నష్ట పరిహారం అందించాలని కలెక్టర్‌ను కోరతానన్నారు. రైతులందరూ పాడి పశువులకు బీమా చేయించుకునేలా వెబ్‌సైట్ ఓపెన్ చేయాలని అధికారులకు సూచించారు. పెద్దేవం, పంగిడి, తణుకు పట్టణాల్లో వ్యాధి లక్షణాలు గుర్తించినట్టు అధికారులు తెలిపారన్నారు. పశుసంవర్థకశాఖ జేడీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండు వారాలుగా పెద్దేవంలో పశువులు అంతుచిక్కని వ్యాధి సోకి మృతి చెందుతున్నాయన్నారు. 10 గేదెలు మృతిచెందగా మరో 15 గేదెలకు ఈ వ్యాధి సోకిందని తెలిపారు.పరీక్షలు నిర్వహించగా పశువుల్లో మెటబాలిజం డిజార్డర్లు కనిపించాయి. రక్త, పేడ నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించగా పేడలో జలగ పురుగులు కనిపించాయన్నారు. రక్త నమూనాల్లో థైలేరియాసిస్ వ్యాధిని గుర్తించామన్నారు.ఈ రెండు వ్యాధుల వల్ల పశువులు మృతిచెందుతున్నాయని నిర్ధారణకు వచ్చి చికిత్స అందిస్తున్నామన్నారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో రెండు పశువులకు కనిపించడంతో చికిత్స అందించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బందిని ఇంటింటికి పంపించి పశువుల ఆరోగ్య లక్షణాలపై సర్వే చేయించామన్నారు.వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులన్నింటికి వైద్యం అందుతుందన్నారు.రైతులు ఆందోళన చెందవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, బేతిన నారాయణ, చావా శ్రీనివాస్, పశుసంవర్థకశాఖ డీడీ ఎస్.సత్యనారాయణ, ఏడీ ఎ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటిని రోజూ పరీక్షించండి

కార్పొరేషన్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యత క్రమంలో నగరంలో అభివృద్ధి పనులను చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగ అధిపతులతో శనివారం సమీక్షించారు. తొలుత నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలో చేపట్టిన 15 రహదారి విస్తరణ పనులను నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పురగోతిలో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా సమీక్షించారు. వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాల గురించి అడిగారు. లోతట్టు వీధుల్లో నీరు నిలిచిపోకుండా సమగ్రయాక్షన్ ప్లాన్ సిద్ధంచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా ఫిర్యాదులు రాకూడదని.ప్రతిరోజు పరీక్షించాలన్నారు.


కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

మురుగుకాల్వలో పైపులైను ఉంటే తక్షణమే మార్చాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లీ, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్, ఈఈలు మాధవి, మదర్సా ఆలీ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీలు, అధికారులు పాల్గొన్నారు.



దేవి.. వైభవం

దేవి నవరాత్రి ఉత్సవాలకు రాజమహేంద్రవరం దేవిచౌక్ ముస్తాబైంది.. పెద్ద ఎత్తున విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. . అత్యాధునిక డిజిటల్.. త్రీడీ లైటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పెద్ద ఎత్తున చలువ పందిళ్లు వేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు.92వ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.
- రాజమహేంద్రవరం కల్చరల్

ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు..

జీతాలు వదలరు?


ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎద్దేవా



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు కానీ..ప్రతి నెలా జీతాలు మాత్రం తీసుకుంటున్నారని..ప్రజా సమస్యలు పట్టని ఇలాంటి ఎమ్మెల్యేలు ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ధ్వజమెత్తారు. జెఎన్‌రోడ్డు వి కన్వెన్షన్‌హాలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు వస్తారని భావించామని, సమావేశాల్లో ప్రజలకు ఉపయోగ పడే కీలక అంశాలు చర్చించామన్నారు. జగన్‌తో సహా పార్టీ 11 మంది డుమ్మా కొట్టారన్నారు. ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని, ప్రజలే ఛీకొట్టి ఇవ్వని ప్రతిపక్ష హోదా ప్రభుత్వం ఎలా ఇస్తుందన్నారు.మాట్లాడే సమయం ఎక్కువ ఇస్తామని చెబుతున్నా అసెంబ్లీకి రావడంలేదని మండిపడ్డారు. ఆ పార్టీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో పోరాడతారు కానీ.. ఎమ్మె ల్యేలు అసెంబ్లీకి రారని ఎద్దేవా చేశారు.

రేపు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం తెలిపారు.అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.అర్జీ స్థితి తెలుసుకోవడానికి 1100 నెంబరుకు కాల్ చేసే అవకాశం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో అర్జీలు స్వీకరిస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి

మండల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు దున్నా సుమన్‌బాబు డిమాండ్



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుమన్‌బాబు, తదితరులు

దేవరపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు దున్నా సుమన్‌బాబు డిమాండ్ చేశారు. దేవరపల్లిలో శనివారం విలేఖర్ల సమావేశంలో సుమన్‌బాబు, మడతల శంకరం, పల్లికొండ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ దేవరపల్లిలో ప్రభుత్వ భూములు, డ్రైనేజీలు, స్మశానభూములు, బండిదారులను కొంత మంది ఆక్రమించుకున్నారని దీనిపై ఆర్‌డీవోకు, తహసీల్దార్‌కు గతంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అలాగే ఎస్సీ ఏరియాలో ఉన్న శ్మశానవాటికను కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని వేరే సెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అట్టివారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వారంతా చేశారు. ఈ ఆక్రమణలు తొలగించి న్యాయం చేయకపోతే రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

గన్ని వీరాంజనేయులుకు అభినందనలు



గన్నికి అభినందనలు తెలుపుతున్న చాగల్లు మండల సొసైటీల అధ్యక్షులు

చాగల్లు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొసైటీల అధ్యక్షులంతా శనివారం భీమడోలులోని క్యాంపు కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుని కలిసి అభినందనలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆప్కాబ్‌కి సిమ్లాలో జరిగిన జాతీయ స్థాయి సహకార సంఘాల సదస్సులో ద్వితీయస్థానం అవార్డు అందుకున్న సందర్భంగా మండల సొసైటీల అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, మార్కొండపాడు సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు, చిక్కాల సొసైటీ అధ్యక్షుడు యంత్రప్రగడ అబ్బులు చౌదరి, కలవలపల్లి సొసైటీ అధ్యక్షుడు అబ్బూరి సీతారాముడు, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్



క్రిస్టియన్‌పేట అర్బన్ హెల్త్ క్లినిక్‌లో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు క్రిస్టియన్‌పేటలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో శనివారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి ప్రారంభించారు. పట్టణ ప్రజలు అర్బన్ హెల్త్‌సెంటర్లలో నిర్వహించే వైద్యసేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు.



పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తాళ్లపూడి: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం తాడిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యశిబి రాన్ని ఏర్పాటుచేశారు. తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు మంచి ఆహారం తీసుకోవాలని ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలి

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు • పలుచోట్ల స్వచ్ఛాంధ్ర .. స్వచ్ఛదివస్ కార్యక్రమాల నిర్వహణ



మున్సిపల్ హైస్కూల్లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్



నిడదవోలులో మొక్క నాటుతున్న మునిసిపల్ ఛైర్మన్ ఆదినారాయణ

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీను స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రజలు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్లో మూడో శనివారం సందర్భంగా ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర .. స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్‌పీలు ఇంటిలో రోజువారీ చెత్తతో కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ, బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, బత్తి నాగరాజు, కండెల్లి రామారావు, సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాస్, గారపాటి రామకృష్ణ, యనమదల సుబ్రహ్మణ్యం, అర్జిల్లి రామకృష్ణ, ఎంఈవో రామకిషోర్, మున్సిపల్ కమిషనర్ సందీప్, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేరాజు, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు పట్టణంలోని ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీ, ఆర్టీసీ డిపో, నూలు వారి సత్రాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి, మొక్కలు నాటారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించాలి

విద్యార్థులకు చదువుతో పాటు స్వచ్ఛభారత్, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ముప్పిడి అన్నారు. మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని ఛైర్‌పర్సన్ రత్నకుమారి కలిసి పరిశీలించారు. తరగతి గదుల వెనుక చెత్త అధికంగా పెరుకుపోవడంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి తరగతి బయట చెత్త వేయడానికి డస్ట్ బిన్ ఏర్పాటుచేసి విద్యార్థులు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు.

నిడదవోలు: పచ్చదనం పరిరక్షణ మనందరి బాధ్యత అని మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శనివారం నిడదవోలులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలుప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి గ్రీన్ ఏపీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, ఉసురుమర్తి జాన్‌బాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వాతావరణ కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఆర్‌జీఎస్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్న కూటి పోసిరాజు, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ రమాదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాడిపూడి ఎంపీపీ స్పెషల్ పాఠశాల నందు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులచే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయ భాస్కరరావు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం దూబచర్లలో ఎంపీడీవో మంగతాయారు, సర్పంచ్ తానిగడప బాలయ్య ఆధ్వర్యంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

దేవరపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం, పల్లంట్ల రోడ్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజారావు, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు పచ్చా రామ్‌గోపాల్, బీజేపీ నాయకులు దున్నా సుమన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్.సునీత అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో..



దూబచర్లలో ...



దేవరపల్లిలో ..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ ఫీడర్‌లో ఆల్‌డీటీఎస్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అలాగే గ్రామంలో వ్యవసాయ మోటార్లు కలిగి ఉన్న రైతులు దీనికి సహకరించాలని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 10 ఫిర్యాదులు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 10 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూర్యదేవర రంజిత్, తుంపల్లి ఆదినారాయణ, కొప్పాక జవహర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ... ఓ వరం

● మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి



వేలివెన్నులో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం బాధితులకు ఓ వరమని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు పట్టణం, రూరల్ మండలాలకు చెందిన 61 మందికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.27.20 లక్షల చెక్కులను శనివారం వేలివెన్నులో అందజేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, సత్యనారాయణ, వర్మ పాల్గొన్నారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఆరు క్వార్టర్ల మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు శనివారం తెలిపారు. మద్దూరులోని ఓ కిరాణాషాపుకు చెందిన యజమాని బర్రే నాగేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో కేరళ మాల్టెట్ విస్కీ 180 ఎంఎల్ బాటిల్స్ ఆరు సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన ఓ వివాహితను అదే కాలనీకి చెందిన మల్లె మసేను వెంటపడేవాడు. కాగా, 18వ తేదీన ఆమె ఇంటి వద్ద ఉండగా వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానాన్ని రద్దుచేయాలి

● రెండోరోజూ కొనసాగిన దస్తావేజు లేఖర్ల నిరసన



కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దస్తావేజు లేఖర్లు



నిడదవోలులో పెన్‌డౌన్ నిర్వహిస్తున్న దస్తావేజు లేఖర్లు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీన్ని రద్దుచేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ రెండోరోజైన శనివారమూ కొనసాగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లంతా కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలు, ఆన్‌లైన్‌లో దస్తావేజుల ఎడిటింగ్ ఆప్షన్ రద్దు, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాదా రామకృష్ణ, ముప్పిడి నాగేశ్వరరావు, రవికిషోర్, మురళీ, వీఎంఎస్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి భూ యజమానులు తమ ఆధార్ ఓటీపీ చెప్పడం వల్ల సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందని, రాష్ట్రప్రభుత్వం తక్షణం కార్డు 2.0 విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర దస్తావేజుల సంఘం లేఖర్ల నాయకుడు వాసా వెంకట సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెండోరోజైన శనివారమూ పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సురేష్ మాట్లాడుతూ భూ యజమానులు సైతం భూముల క్రయ, విక్రయాల్లో ఓటీపీ విధానాన్ని రద్దుచేయాలని మద్దతు పలుకుతున్నారన్నారు. రైతులు వాకలపూడి సూర్యనారాయణ, ముళ్లపూడి చిన్ని, వాలపూడి వెంకటాయుడు, పేరిచర్ల నాగరాజు, గుంటూరి కృష్ణంరాజు, ముదునూరి వెంకట్రాజు, పెనుగొండ సుబ్బారాయుడు, బూరుగుపల్లి సత్యనారాయణ పలువురు రైతులు దస్తావేజుల లేఖర్లకు మద్దతిచ్చారు. దస్తావేజు లేఖర్లు కేవీఎస్ ప్రసాద్, కేవీ చలపతి, ఏవీ సుబ్బారావు, పెమ్మరాజు రాజాజీ, నార్ని శ్యామలరావు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపల్లిలో నిరసన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

నల్లజర్ల: దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18వ తేదీ నుంచి 20 వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ముందు నిరసన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల మండలాధ్యక్షుడు మంచిరాజు రవికుమార్ మాట్లాడుతూ 2.0 వెర్షన్ అప్‌డేట్ వల్ల కక్షిదారులతోపాటు తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు.ఆధార్ ఓటీపీ వల్ల సమస్య మరింత ఆలస్యమవుతోందన్నారు. నూతన విధానం వల్ల కక్షిదారులు, దస్తావేజు లేఖర్ల సమయం వృథా అవుతుందని, దీన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి సులభతరం చేయాలని కోరారు.

కొనసాగుతున్న వీఆర్‌ఏల నిరసన



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలను నాల్గోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెమొగ్గల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం డివిజన్ పరిధిలోని వీఆర్‌ఏలంతా నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు కే.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు గళం విప్పారు. ఈ మేరకు శనివారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట నల్లజర్ల మండలానికి చెందిన వీఆర్‌ఏలంతా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు షేక్ సర్దార్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, అలాగే ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలన్నారు.



కొవ్వూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నల్లజర్ల మండల వీఆర్‌ఏలు



పట్టణంలోని అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విరిగిపడిన దృశ్యం

తప్పిన పెనుప్రమాదం

● ఈదురుగాలులకు కరెంట్ వైరుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

● అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో..

కొవ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు పట్టణంలోని బాపూజీనగర్‌లో గల అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపై ఉన్న చెట్టుకొమ్మ విద్యుత్ వైర్లపై విరిగిపడింది. దీంతో సమాచారం అందుకున్న అధికారులు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఆ సమయంలో విద్యార్థులంతా పాఠశాలలోనే ఉన్నారు. కాగా, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయం నుంచి ఎండతీవ్రతతో ప్రజలు అల్లాడిపోతుండగా, మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమై ఈదురుగాలులు వీచాయి.

భక్తవత్సలా... గోవింద

● వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.61.08 లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జోరువానను సైతం లెక్కచేయ్యకుండా అశేష భక్తజనం తిరువీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఆదాయం రూ.61.08 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

తాళ్లపూడిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తాళ్లపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వస్తువులపై జీఎస్టీ తగ్గించడంపై ఆనందోత్సవాలు ప్రకటిస్తూ మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ మాట్లాడుతూ మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని చేపట్టిన సేవా పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా తాడిపూడిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తిరుమలశెట్టి కృష్ణ, వెటుగుబంటి బాలకృష్ణ, గోకవరపు జితేంద్ర రవి, నామా రంగనాయకులు, మల్లిపూడి రాజేష్, ప్రగడా సత్యనారాయణ పాల్గొన్నారు.

టీచర్లకు ఘన సత్కారం

తాళ్లపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం పలువురు ఉత్తమ టీచర్లను ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో - 2 నెహ్రూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన పీ.రామలక్ష్మి, పీ.కనకదుర్గ, బీ. బుచ్చిబాబు, ఎం.జయబాబు, కే.రాజ్యలక్ష్మి,బీ. శంకరరావు, డీ. రామును, అలాగే జిల్లా ఉత్తమ టీచర్లైన ఎం. రాజకుమారి, వై.శంకరం, ఏఎన్‌వీ రామ్మోహన్‌రావును సత్కరించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

దేవరపల్లి డైమండ్ జంక్షన్ శివారులో ఘటన

దేవరపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి డైమండ్ జంక్షన్ శివారు గోల్డ్‌ఫిష్ రెస్టారెంట్ ఎదురుగా శనివారం రాత్రి రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న లారీడ్రైవర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలివి.. గుంటూరు జిల్లా యంగళాయపాలెంకు చెందిన లారీడ్రైవర్ చెరుకూరి నాగమల్లేశ్వరరావు (55) లారీని ఆపి భోజనం కోసం రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా పీసుపీసులుగా మారిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీ. సుబ్రహ్మణం వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.